News Daily
ఎడిటర్ :
B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in : www.cknewstv.in

CK NEWS
చంద్ర కాంత్
తెలుగు దినపత్రిక

Website cknewstv.in

సంపుటి : 03 | సంచిక :186 | ఖమ్మం | బుధవారం, ఆగస్టు 20, 2025 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad

## తెలంగాణకు రావాల్సిన యూరియా వాటాను ఇవ్వడం లేదు

### కిషన్ రెడ్డి, బండి సంజయ్‌పై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఆగ్రహం

- యూరియాను తీసుకువచ్చే బాధ్యతను కేంద్రమంత్రులు తీసుకోవాలని డిమాండ్
- బీజేపీ, బీఆర్ఎస్ లోపాయికారి ఒప్పందంతో యూరియాను అడ్డుకుంటున్నాయని ఆరోపణ



తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అప్రతిష్ఠపాలు చేసేందుకు బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు కుట్రలు పన్నుతున్నాయని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ విమర్శించారు. తెలంగాణకు రావాల్సిన యూరియా వాటాను కేంద్ర ప్రభుత్వం ఇవ్వడం లేదని ఆయన ఆరోపించారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ యూరియాను రాష్ట్రానికి తీసుకువచ్చే బాధ్యత తీసుకోవాలని డిమాండ్ చేశారు. యూరియా కోసం రైతులు ఇక్కడ ఆందోళన చేస్తుంటే కిషన్ రెడ్డి ఢిల్లీలో నిద్రపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ విషయంలో కిషన్ రెడ్డి, బండి సంజయ్ వ్యవహరిస్తున్న తీరు సరికాదని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు యూరియా కోసం కేంద్రానికి లేఖలు రాశారని గుర్తు చేశారు. బీజేపీ, బీఆర్ఎస్ లు లోపాయికారి ఒప్పందంతో యూరియాను అడ్డుకుంటున్నాయని ఆరోపించారు.

వివరాలు 2లో..

# జస్టిస్ సుదర్శన్‌రెడ్డి విజయానికి తెలుగు రాష్ట్రాలు ఏకమవ్వాలి

**ఉప రాష్ట్రపతిగా ఆయన్ను గెలిపించుకోవడం తెలుగువారిగా మన బాధ్యత**

**చంద్రబాబు, కేసీఆర్, ఒవైసీ, జగన్, పవన్ కల్యాణ్, భాజపా నేతలకు సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి**



**అభ్యర్థి గెలిస్తే.. కేంద్రం రాజ్యాంగాన్ని మార్చడమే కాదు.. రిజర్వేషన్లను కూడా రద్దు చేస్తుంది. అందుకే ఆత్మప్రబోధానుసారం ఓటేయండని తెలుగు రాష్ట్రాల ఎంపీలకు విజ్ఞప్తి చేస్తున్నా. అలా చేస్తే సుదర్శన్‌రెడ్డి గెలుస్తారు.**

**ఉప రాష్ట్రపతి ఎన్నిక అనేది.. ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల మధ్య పోరు. తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల మధ్య పోరు కానే కాదు. రాజ్యాంగాన్ని పరిరక్షించేవారికి.. రాజ్యాంగ హక్కులను కాలరాచే వారికి మధ్య పోరు.**

**సీఎం రేవంత్‌రెడ్డి**

"జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా నిలపాలన్నది ఇండియా కూటమి నిర్ణయం. ఇది తెలుగువారికి దక్కిన గొప్ప గౌరవం. ముఖ్యంగా తెలంగాణ ప్రజల గౌరవ ప్రతిష్ఠలను పెంచింది. ఆయన కాంగ్రెస్ పార్టీ సభ్యుడు కాదు.. ఇండియా కూటమి ప్రతిపాదించిన న్యాయనిపుణుడు. ఆయనకు ఏ రాజకీయ పార్టీతోనూ సంబంధం లేదు. తెలుగు రాష్ట్రాల్లోని 42 మంది లోక్‌సభ సభ్యులు, 18 మంది రాజ్యసభ సభ్యులు ఒక్క తాటిపైకి వచ్చి.. ఆయన గెలుపులో భాగస్వాములు కావాలి". అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. జూబ్లీహిల్స్‌లోని నివాసంలో ఆయన మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'రాజకీయాలకు అతీతంగా ఆయన్ను గెలిపించాల్సిన బాధ్యత మనపై ఉందని నేతలు చంద్రబాబు, కేసీఆర్, జగన్, పవన్ కల్యాణ్, అసదుద్దీన్ ఒవైసీలతో పాటు.. రెండు రాష్ట్రాల్లోని భాజపా ఎంపీలను తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ తరఫున, మంత్రివర్గం తరఫున కోరుతున్నా. తెలుగు రాష్ట్రాల్లో ప్రాతినిధ్యం లేకపోయినా.. వారి ప్రాతినిధ్యం ఉన్న స్థానాల నుంచి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి విజయానికి మద్దతు పలకాలని ఉభయ కమ్యూనిస్టు పార్టీలకు విజ్ఞప్తి చేస్తున్నా' అని సీఎం పేర్కొన్నారు.

**ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న ఎన్డీయే..**

"ఉప రాష్ట్రపతి ఎన్నికలో ప్రజాస్వామ్య ప్రక్రియను అపహాస్యం చేస్తున్న ఎన్డీయే కూటమి ఒకవైపు... మహాత్ముడి స్ఫూర్తితో సాధించుకున్న ప్రజాస్వామ్యాన్ని.. డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ అందించిన రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు పోరాడుతున్న ఇండియా కూటమి మరోవైపు ఉన్నాయి. రాజ్యాంగాన్ని రద్దు చేయాలని కుట్రలు చేస్తున్న వారిని ఈ ఉప రాష్ట్రపతి ఎన్నికలో ఓడించడానికి ఇండియా కూటమి.. తెలంగాణ బిడ్డ సుదర్శన్‌రెడ్డిని అభ్యర్థిగా ప్రకటించింది. న్యాయకోవిదుడు

వివరాలు 2లో..

## కాళేశ్వరం కమిషన్ నివేదిక...

## హైకోర్టులో కేసీఆర్, హరీశ్ రావు పిటిషన్లు

- జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికను కొట్టివేయాలని కోరుతూ పిటిషన్లు
- పీసీ ఘోష్ కమిషన్‌కు విచారణార్హత లేదన్న కేసీఆర్
- కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆరోపణ

వివరాలు 2లో..



## పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించండి

## జీఎస్టీ కౌన్సిల్‌కు కేటీఆర్ బహిరంగ లేఖ

- జీఎస్టీ స్లాబ్ రద్దు అంటూ కేంద్రం ప్రచారం చేసుకుంటోందని విమర్శ
- పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గితే అన్ని వస్తువుల ధరలు తగ్గుతాయన్న కేటీఆర్
- గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేనేతల సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చిందన్న కేటీఆర్




ధరల తగ్గింపుపై కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. జీఎస్టీ కౌన్సిల్ సమావేశం నేపథ్యంలో కేంద్రానికి కేటీఆర్ బహిరంగ లేఖ రాశారు. జీఎస్టీ స్లాబ్ రద్దు అంటూ కేంద్రం ప్రచారం చేసుకుంటోందని, కానీ ధరల తగ్గింపుపై చిత్తశుద్ధి లేదని అన్నారు. పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గితే అన్ని వస్తువుల ధరలు తగ్గుతాయని

వివరాలు 2లో..

## విపక్షాల ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా తెలుగు తేజం!

- ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి
- సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తిగా పనిచేసిన జస్టిస్ రెడ్డి
- ఆయన స్వస్థలం తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా
- ఎన్డీయే అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్‌తో పోటీ
- ఏకగ్రీవం చేయాలన్న అధికార పక్షం ఆశలకు గండి

వివరాలు 2లో..



## కోటాలో గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్టుకు గ్రీన్ సిగ్నల్

### కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు ఇవే

రాజస్థాన్‌లో ని కోటా-బురిడీ లో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ నిర్మాణానికి కేంద్ర కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కోటా ఎయిర్‌పోర్ట్‌కు 440.06 హెక్టార్ల భూమి, రూ.1507 కోట్ల మంజూరుకు మంత్రి మండలి

వివరాలు 2లో..



# సింధు జలాల ఒప్పందం

## నెహ్రూపై మరోసారి విరుచుకుపడ్డ ప్రధాని మోదీ

- సింధు జలాల ఒప్పందం నెహ్రూ చేసిన చారిత్రక తప్పిదం అన్న ప్రధాని మోదీ
- దేశాన్ని నెహ్రూ రెండుసార్లు విభజించారని తీవ్ర విమర్శలు
- ఒప్పందం వల్ల రైతులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆరోపణ
- మోదీ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన ప్రియాంక గాంధీ
- గతాన్ని వదిలి ప్రస్తుత సమస్యలపై మాట్లాడాలని కాంగ్రెస్ డిమాండ్

వివరాలు 2లో..



# విష ప్రచారాలు ఆపాలి

## జగన్‌కు మంత్రి నారాయణ సూచన

- అమరావతి మునిగిపోతోందన్న విష ప్రచారాలను ఆపాలన్న నారాయణ
- కొండవీటి వాగుకు మట్టి అడ్డంగా వదిలేయడమే ప్రస్తుత పరిస్థితికి కారణమని వెల్లడి
- ఇలాగే చేస్తే ఉన్న 11 సీట్లు కూడా వైసీపీకి దక్కవని హెచ్చరిక

వివరాలు 2లో..





## వివేకా హత్య కేసులో అవినాశ్ రెడ్డే ప్రధాన సూత్రధారి

### సుప్రీంకోర్టులో సునీత న్యాయవాది వాదనలు

- అవినాశ్ బెయిల్ రద్దు పిటిషన్‌పై విచారణ
- సుప్రీంకోర్టులో వాడివేడి వాదనలు
- డాక్టర్ సునీత, ఆమె భర్త, సీబీఐ మాజీ అధికారిపై నమోదైన కేసులు కొట్టివేత
- సాక్ష్యాల ధ్వంసం రుజువైందని, నిందితులకు మరణశిక్ష పడొచ్చని కోర్టుకు తెలిపిన సీబీఐ

వివరాలు 2లో..

## పంట నష్టపోయిన రైతులకు మంత్రి జూపల్లి గుడ్ న్యూస్



హైదరాబాద్: రాష్ట్రంలో కురుస్తోన్న భారీ వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు గుడ్ న్యూస్ చెప్పారు మంత్రి జూపల్లి కృష్ణారావు. జిల్లా ఇంచార్జ్ మంత్రి హోదాలో మంగళవారం (ఆగస్ట్ 19) ఆయన ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించారు. వర్షాలు, వరదల వల్ల జరిగిన పంట నష్టం గురించి అధికారులతో చర్చించారు. అనంతరం మంత్రి జూపల్లి మీడియాతో మాట్లాడుతూ.. భారీ వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ప్రతి ఎకరాకు రూ.10 వేల నష్టపరిహారం ఇస్తామని ప్రకటించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో పంట నష్టపోతే రైతులకు ఎప్పుడూ నష్టపరిహారం ఇవ్వలేదని.. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మానవతాదృక్పథంతో ఎకరాకు పదివేలు ఇవ్వాలని నిర్ణయించిందని తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలు, వరదల వల్ల భారీ నష్టం సంభవించిందని.. రోడ్లు, పంట పొలాలు తీవ్రంగా దెబ్బతిన్నాయన్నారు. పలుచోట్ల విద్యుత్ స్థంబాలు

వివరాలు 2లో..

# పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించండి

# జీఎస్టీ కౌన్సిల్‌కు కేటీఆర్ బహిరంగ లేఖ

కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికను రద్దు చేయాలని కోరుతూ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ప్రస్తుతం ఈ పిటిషన్లు హైకోర్టు రిజిస్ట్రీ పరిశీలనలో ఉన్నాయి. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌కు విచారణార్హత లేదని, ఆ కమిషన్ సమర్పించిన నివేదికను కొట్టివేయాలని వారు కోరారు. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ తమ విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకోలేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ మేరకు కేసీఆర్, హరీశ్ రావు వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని వారు ఆరోపించారు. ప్రభుత్వానికి ఏది కావాలో కమిషన్ నివేదిక ఆ విధంగా ఉందని
ఆయన పేర్కొన్నారు.
కేంద్ర ప్రభుత్వం చేనేత వస్త్రాలపై 5 శాతం జీఎస్టీ విధించిందని, ఆ తర్వాత ఆ పన్నును 12 శాతానికి పెంచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చేనేత వస్త్రాలపై జీఎస్టీ విధింపును వ్యతిరేకిస్తూ తాము కేంద్ర ప్రభుత్వానికి అప్పుడే లేఖ రాశామని గుర్తు చేశారు. వ్యవసాయం తర్వాత లక్షలాది కుటుంబాలు చేనేత రంగంపై ఆధారపడ్డాయని అన్నారు. చేనేత అనేది కేవలం వస్త్ర తయారీ రంగం మాత్రమే కాదని, అది మన సాంస్కృతిక వారసత్వమని ఆయన అన్నారు. చేనేతపై పన్ను వేయడమంటే మన సంస్కృతిని అవమానించడమేనని కేటీఆర్ మండిపడ్డారు. కేసీఆర్ నేతృత్వంలోని గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేనేతల సంక్షేమానికి ఎనలేని ప్రాధాన్యత ఇచ్చిందని అన్నారు.

# విపక్షాల ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా తెలుగు తేజం!

ఉపరాష్ట్రపతి ఎన్నికల బరిలో విపక్షాల ఇండియా కూటమి తమ అభ్యర్థిని ఖరారు చేసింది. ఎవరూ ఊహించని విధంగా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి, తెలంగాణకు చెందిన జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి పేరును ఈరోజు అధికారికంగా ప్రకటించింది. ఈ నిర్ణయంతో ఉపరాష్ట్రపతి ఎన్నిక ఏకగ్రీవం కావాలన్న అధికార పక్షం ప్రయత్నాలకు ప్రతిపక్షాలు గండికొట్టినట్టయింది. జస్టిస్ సుదర్శన్ రెడ్డి న్యాయవ్యవస్థలో విశేషమైన అనుభవం ఉంది. ఆయన 2007 నుంచి 2011 వరకు సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా సేవలు అందించారు. ఆ తర్వాత గోవా లోకాయుక్తగా కూడా బాధ్యతలు నిర్వర్తించారు. ఆయన స్వస్థలం తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా ఆకుల మైలారం గ్రామం. న్యాయ వ్యవస్థలో ఉన్నత స్థాయిలో పనిచేసిన తెలుగు వ్యక్తిని ప్రతిపక్షాలు తమ అభ్యర్థిగా ఎంపిక చేయడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఇప్పటికే అధికార ఎన్డీయే కూటమి తమ అభ్యర్థిగా దక్షిణాదికి చెందిన సీపీ రాధాకృష్ణన్ పేరును ప్రకటించిన విషయం తెలిసిందే. దీనికి బదులుగా ఇండియా కూటమి సైతం దక్షిణాది నుంచే బలమైన అభ్యర్థిని నిలబెట్టాలని నిర్ణయించుకుంది.

ఈ క్రమంలో అనూహ్యంగా జస్టిస్ సుదర్శన్ రెడ్డి పేరును తెరపైకి తెచ్చింది. దీంతో ఇప్పుడు ఉపరాష్ట్రపతి ఎన్నికల పోరు ఇద్దరు దక్షిణాది నేతల మధ్య ఆసక్తికరంగా మారింది.
ఈ ఎంపిక ద్వారా ప్రతిపక్షాలు కేవలం పోటీ ఇవ్వడమే కాకుండా, న్యాయవ్యవస్థకు చెందిన ప్రముఖుడిని బరిలోకి దించి వ్యూహాత్మకంగా వ్యవహరించాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# విష ప్రచారాలు ఆపాలి

:రాజధాని అమరా వతిపై వైసీపీ అధినేత జగన్ చేస్తున్న విష ప్రచారాన్ని ఇకనైనా ఆపాలని రాష్ట్ర మంత్రి నారాయణ హితవు పలికారు. అమరావతి మునిగిపోతోం దంటూ చేస్తున్న ఆరోపణలను తీవ్రం గా ఖండించిన ఆయన, వాస్తవాలు తెలుసుకోకుండా మాట్లాడవద్దని సూచించారు. కొండవీటి వాగు పరిసరాల్లో నీరు
నిలిచిపోయిన నీరుకొండ ప్రాంతాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడి, సమస్యకు గల కారణాలను మీడియాకు వివరించారు. పశ్చిమ బైపాస్ రహదారిపై వంతెన నిర్మాణ సమయంలో తొలగించిన మట్టిని వాగు ప్రవాహానికి అడ్డంగా వదిలేయడమే ప్రస్తుత పరిస్థితికి కారణమని మంత్రి స్పష్టం చేశారు. "నిర్మాణ పనులు జరిగేటప్పుడు వర్షం పడితే గుంతల్లోకి నీళ్లు చేరడం సహజం. అంతమాత్రానికే ఐకానిక్ భవనాలు మునిగిపోయాయని ప్రచారం చేయడం సరికాదు" అని అన్నారు. కేవలం రెండు గ్రామాల పరిధిలోని పొలాల్లోకి మాత్రమే నీరు చేరిందని, మిగిలిన గ్రామాల్లో వర్షం పడిన కొద్ది గంటల్లోనే నీరు వెళ్లిపోయిందని తెలిపారు. కొండవీటి వాగు ప్రవాహానికి ఆటంకంగా ఉన్న మట్టిని తక్షణమే తొలగించాలని మంత్రి నారాయణ అధికారులను ఆదేశించారు. వైసీపీ నేతలు ఇలాగే విష ప్రచారాలు కొనసాగిస్తే, వచ్చే ఎన్నికల్లో ఇప్పుడు గెలిచిన 11 స్థానాలు కూడా దక్కవని నారాయణ హెచ్చరించారు. "రాజధాని మునిగిపోతుందని ఆరోపించే వారు ఇక్కడికి వచ్చి వాస్తవ పరిస్థితిని చూడాలి. నోటికి వచ్చినట్లు మాట్లాడితే ప్రజలు సహించరు" అని ఆయన తీవ్ర స్వరంతో హెచ్చరించారు.

# జస్టిస్ సుదర్శన్‌రెడ్డి విజయానికి

# తెలుగు రాష్ట్రాలు ఏకమవ్వాలి

- మొదటి పేజీ తరువాయి
ఉప రాష్ట్రపతి అయితే.. రాజ్యాంగాన్ని పరిరక్షించడానికి వీలవుతుంది. దేశ ప్రజలకు ప్రయోజనం చేకూరుతుంది. ప్రజాస్వామ్యానికి రక్షణ లభిస్తుంది. తెలుగును ప్రాచీన భాషగా గుర్తించాలనుకున్నప్పుడు అందరం ఏకమయ్యాం. 1991లో ప్రధాని రేసులో ఉన్న పీవీ నరసింహారావు నంద్యాల ఎంపీగా పోటీ చేసినప్పుడు.. ఆనాడు ఎన్టీఆర్ ఆయనపై పోటీ పెట్టకుండా మద్దతు పలికారు. నాటి ఎన్నికల్లో ప్రధాన ప్రతిపక్షంగా తెదేపా పోటీ పెట్టలేదు. సిద్ధాంతరపరంగా వైరుధ్యమున్నా పీవీకి ఎన్టీఆర్ మద్దతు పలికి.. రాజకీయ విజ్ఞతను ప్రదర్శించారు. ఈరోజు తెలుగు వారందరూ కూడా ఎన్టీఆర్‌ను ఆదర్శంగా, స్ఫూర్తిగా తీసుకొని.. రాజకీయ విజ్ఞతను ప్రదర్శించాలి. ఒక తెలుగు వ్యక్తి ఉప రాష్ట్రపతి అయ్యేలా మద్దతివ్వాలి. ఇప్పుడు సుదర్శన్‌రెడ్డి ఉప రాష్ట్రపతిగా నెగ్గితే.. భవిష్యత్‌లో రాష్ట్రపతి అయ్యే అవకాశం ఉంటుంది. అందుకే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరఫున.. తెదేపా, వైకాపా, భారత రాష్ట్ర సమితి, ఎంఐఎం, జనసేన పార్టీలతో పాటు.. ఉభయ రాష్ట్రాల్లో ఉన్న భాజపా రాజ్యసభ, లోక్‌సభ సభ్యులకు విజ్ఞప్తి చేస్తున్నా.
బీసీ రిజర్వేషన్లను అడ్డుకునేందుకు సీపీ రాధాకృష్ణన్‌ను మోదీ ప్రభుత్వం ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా తెర మీదకు తెచ్చింది. రాధాకృష్ణన్ గెలిస్తే ఓబీసీలకు అన్యాయమే జరుగుతుంది. 42 శాతం రిజర్వేషన్ల గురించి కేంద్రం ఆలోచించే ప్రసక్తే ఉండదు. బీసీ కులగణన అధ్యయనానికి ప్రభుత్వం నియమించిన స్వతంత్ర నిపుణుల కమిటీ ఛైర్మన్‌గా జస్టిస్ సుదర్శన్‌రెడ్డి పనిచేశారు. ఓబీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు అనుకూలంగా ఆయన నిర్ణయాలున్నాయి. ఆయన సూచనల మేరకే తెలంగాణ ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లులను ఆమోదించింది. ఆయన బలహీన వర్గాల గొంతుక. ఓబీసీ రిజర్వేషన్లకు మద్దతు పలికే అన్ని రాజకీయ పార్టీలూ జస్టిస్ సుదర్శన్‌రెడ్డి విజయానికి అండగా నిలవాలి" అని సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.

**అధిష్ఠానం ఆదేశిస్తే కేసీఆర్ వద్దకు..**

విలేకరుల సమావేశం అనంతరం మీడియాతో సీఎం రేవంత్‌రెడ్డి ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. భారత రాష్ట్ర సమితి ఎంపీల మద్దతు కోసం కేసీఆర్‌ను కలుస్తారా అని విలేకరులు ప్రశ్నించగా.. "మా పార్టీ అధిష్ఠానం ఆదేశిస్తే.. నేను వెళ్లి కేసీఆర్‌ను కలుస్తా. అయినా ఆయన నాకు అపాయింట్‌మెంట్ ఇవ్వాలి కదా" అని రేవంత్‌రెడ్డి సరదాగా అన్నారు. కేసీఆర్ ఆసుపత్రిలో ఉన్నప్పుడు తానే వెళ్లి కలిశానన్నారు. అయినా పోలింగ్‌కు ఇంకా చాలా సమయం ఉందని, ఎవరెవరి మద్దతు కూడగట్టాలనేది కూటమి నిర్ణయిస్తుందని తెలిపారు. 21న ఇండియా కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా జస్టిస్ సుదర్శన్‌రెడ్డి నామినేషన్ వేయనుండడంతో.. ఆ కార్యక్రమంలో పాల్గొనేందుకు దిల్లీకి వెళ్లనున్నట్లు ముఖ్యమంత్రి చెప్పారు. సుప్రీంకోర్టులో రాష్ట్రం తరఫున వాదనలు
రాష్ట్ర శాసనసభ ఆమోదించిన బిల్లులపై గవర్నర్, రాష్ట్రపతి 90 రోజుల్లోగా నిర్ణయాలను వెల్లడించాలనే అంశంపై సుప్రీంకోర్టు అన్ని రాష్ట్రాల అభిప్రాయాలను అడిగిందని, తెలంగాణ రాష్ట్రం కూడా తమ వాదనలను వినిపించనుందని సీఎం రేవంత్‌రెడ్డి ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. తెలంగాణ తరఫున వాదనలు వినిపించడానికి ఇప్పటికే న్యాయవాదులను నియమించినట్లు తెలిపారు. "బీసీ రిజర్వేషన్లపై తెలంగాణ ప్రభుత్వం రెండు వేర్వేరు బిల్లులను ఆమోదించి గవర్నర్‌కు పంపించింది. ఆ రెండు బిల్లులను గవర్నర్.. రాష్ట్రపతికి పంపించారు. దాదాపు నాలుగు నెలలుగా రాష్ట్రపతి వద్దే పెండింగ్‌లో ఉన్నాయి. అక్కడ జాప్యం జరుగుతుండడంతో.. స్థానిక సంస్థల ఎన్నికల్లో
బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకొచ్చింది. ఆ ఆర్డినెన్స్‌ను గవర్నర్ ఆమోదం కోసం పంపించగా.. దాన్ని కూడా ఆయన రాష్ట్రపతికి పంపించారు" అని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. విలేకరుల సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, వివేక్ వెంకటస్వామి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం పాల్గొన్నారు.

# కోటాలో గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్టుకు గ్రీన్ సిగ్నల్

- మొదటి పేజీ తరువాయి
ఆమోదం తెలిపింది. అలాగే.. ఒడిశాలో కటక్-భువనేశ్వర్ 6 లేన్ల రింగ్ రోడ్డు నిర్మాణానికి కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. రూ.8307 కోట్ల వ్యయంతో భువనేశ్వర్ రింగ్‌రోడ్డు నిర్మాణాం చేపట్టానున్నారు. ప్రధాని మోడీ అధ్యక్షతన మంగళవారం (ఆగస్ట్ 19) డిల్లీలో కేంద్ర కేబినెట్ భేటీ అయ్యింది. ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు మంత్రి మండలి ఆమోద ముద్ర వేసింది. భేటీ అనంతరం కేబినెట్ నిర్ణయాలను మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు. రాజస్థాన్?లోని కోటా-బురిడీలో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్, ఒడిశాలో కటక్-భువనేశ్వర్ 6 లేన్ల రింగ్ రోడ్డు నిర్మాణానికి కేబినెట్ ఆమోదం తెలిపిందని చెప్పారు. కోట-బుండి గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయాన్ని రూ.1507.00 కోట్ల అంచనా వ్యయంతో అభివృద్ధి చేయడానికి ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా చేసిన ప్రతిపాదనను కేబినెట్ ఆమోదించిందని తెలిపారు.
భారీగా పెరిగిన వాహనాల రద్దీని క్రమబద్ధీకరించడానికి ఒడిశాలో కటక్-భువనేశ్వర్ మధ్య 6 లేన్ల రింగ్ రోడ్డు నిర్మాణానికి కేబినెట్ అప్రూవల్ తెలిపిందన్నారు. ఈ ప్రాజెక్ట్ కటక్, భువనేశ్వర్, ఖోర్ధా నగరాల నుండి ట్రాఫిక్‌ను మళ్లించడం ద్వారా ఒడిశా, ఇతర తూర్పు రాష్ట్రాలకు గణనీయమైన ప్రయోజనాన్ని అందిస్తుందని తెలిపారు. ఈ ప్రాజెక్ట్ సరుకు రవాణా సామర్థ్యాన్ని మరింత పెంచుతుందని.. అలాగే ఈ ప్రాంతంలో సామాజిక-ఆర్థిక వృద్ధిని పెంచుతుందని పేర్కొన్నారు.

# కాళేశ్వరం కమిషన్ నివేదిక... హైకోర్టులో కేసీఆర్, హరీశ్ రావు పిటిషన్లు

- మొదటి పేజీ తరువాయి
వారు పేర్కొన్నారు.
కాళేశ్వరం కమిషన్ ఛైర్మన్ జస్టిస్ పీసీ ఘోష్ సమర్పించిన నివేదికకు ఇటీవల రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. విచారణకు సంబంధించిన వివరాలను కమిషన్ విశ్లేషణాత్మకంగా నివేదికలో పొందుపరిచిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ నివేదికను త్వరలో అసెంబ్లీలో ప్రవేశపెడతామని, అన్ని రాజకీయ పార్టీల అభిప్రాయాలను స్వీకరిస్తామని రేవంత్ రెడ్డి ప్రకటించారు.

# సింధు జలాల ఒప్పందం

.భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మరోసారి తీవ్ర విమ ర్శలు గుప్పించారు. సింధు నదీ జలాల ఒప్పందం విషయంలో నెహ్రూ
చారిత్రక తప్పిదానికి పాల్పడ్డారని, తద్వారా దేశ రైతాంగానికి తీరని అన్యాయం చేశారని ఆరోపించారు. మంగళవారం జరిగిన ఎన్డీఏ పార్లమెంటరీ సమావేశంలో ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. పార్లమెంట్ లైబ్రరీ భవనంలో జరిగిన ఈ సమావేశంలో మోదీ మాట్లాడుతూ, "నెహ్రూ దేశాన్ని ఒకసారి కాదు, రెండుసార్లు విభజించారు. మొదట రాడ్‌క్లిఫ్ లైన్‌తో, ఆ తర్వాత సింధు జలాల ఒప్పందంతో దేశానికి నష్టం చేకూర్చారు" అని వ్యాఖ్యానించారు. ఈ ఒప్పందం కింద సింధు నది జలాల్లో 80 శాతం నీటిని పాకిస్థాన్‌కు ధారాదత్తం చేశారని ఆయన మండిపడ్డారు. ఆ తర్వాత తన కార్యదర్శి వద్ద ఈ ఒప్పందం వల్ల ఎలాంటి ప్రయోజనం కలగలేదని నెహ్రూ స్వయంగా తన తప్పును అంగీకరించారని మోదీ తెలిపారు. ఈ ఒప్పందం పూర్తిగా రైతు వ్యతిరేకమని ఆయన అభివర్ణించారు. రాజ్యాంగం కల్పించిన వాక్ స్వాతంత్ర్యపు హక్కును కాలరాసేందుకు నెహ్రూ హయాంలో రాజ్యాంగ సవరణ చేశారని మోదీ మండిపడ్డారు. ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా నియోజకవర్గాల సంఖ్యను పెంచారని విమర్శించారు. వెనుకబడిన వర్గాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడూ కృషి చేయలేదని, తమ ప్రభుత్వం వచ్చాకే వారి అభివృద్ధి మొదలైందని అన్నారు. ఎన్డీయే హయాంలో దేశం మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగే దిశగా అడుగులు వేస్తోందని అన్నారు.

**నెహ్రూను నిందించడం అలవాటుగా మారింది: ప్రియాంక**

ప్రధాని మోదీ వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ తీవ్రంగా స్పందించారు. 11 ఏళ్లుగా అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం, తమ బాధ్యతల నుంచి తప్పించుకోవడానికే పదేపదే నెహ్రూను నిందిస్తోందని ఆమె విమర్శించారు. "గతాన్ని పదేపదే తవ్వడం మానేసి, వర్తమానంలో జరుగుతున్న విషయాలపై సమాధానం చెప్పాలి. ఓట్ల దొంగతనం ఆరోపణలపై ఎందుకు మౌనంగా ఉన్నారు? ప్రజలకు జవాబుదారీగా ఉండాలి" అని పార్లమెంట్ వెలుపల మీడియాతో మాట్లాడుతూ ప్రియాంక డిమాండ్ చేశారు.

# వివేకా హత్య కేసులో అవినాశ్ రెడ్డే ప్రధాన సూత్రధారి

మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసు విచా రణలో భాగంగా సుప్రీంకోర్టులో సంచలన పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఈ హత్య వెనుక కడప ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డే 'మాస్టర్ మైండ్' అని వివేకా
కుమార్తె డాక్టర్ సునీత తరఫు న్యాయవాది సిద్ధార్థ్ లూత్రా ధర్మాసనం ముందు తీవ్ర ఆరోపణలు చేశారు. అవినాశ్ రెడ్డి సహా ఇతర నిందితుల బెయిల్‌ను రద్దు చేయాలని కోరుతూ సునీత దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఈ వాడివేడి వాదనలు జరిగాయి. విచారణ సందర్భంగా సిద్ధార్థ్ లూత్రా వాదనలు వినిపిస్తూ.. నిందితులు సాక్షులను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నారని, సాక్ష్యాలను తారుమారు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ కుట్రలో భాగంగానే డాక్టర్ సునీత, ఆమె భర్త రాజశేఖర్ రెడ్డి, సీబీఐ మాజీ ఎస్పీ రామ్ సింగ్‌లపై ఉద్దేశపూర్వకంగా తప్పుడు కేసులు నమోదు చేశారని ఆరోపించారు. ఈ కేసులో మరింత లోతైన దర్యాప్తు జరగాల్సిన అవసరం ఉందని, అప్పుడే అసలు సూత్రధారులు, పాత్రధారులు బయటకు వస్తారని ఆయన వాదించారు. మరోవైపు, సీబీఐ తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు వాదనలు వినిపిస్తూ.. ఈ కేసులో సాక్ష్యాల ధ్వంసం జరిగిందని దర్యాప్తులో స్పష్టంగా నిరూపితమైందని తెలిపారు. మొదట గుండెపోటు అని, ఆ తర్వాత రక్తపు వాంతులని ప్రచారం చేసి హత్యను కప్పిపుచ్చేందుకు అన్ని విధాలా ప్రయత్నించారని వివరించారు. ఈ నేరం తీవ్రతను బట్టి నిందితులకు మరణశిక్ష విధించే అవకాశం కూ డా ఉందని ఆయన వ్యాఖ్యానించారు. ఇదే సమయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభు త్వం తరఫు న్యాయవాది అహ్మదీ వాదిస్తూ.. నిందితుడు శివశంకర్ రెడ్డి కుమారుడు చైతన్య రెడ్డి, మెడికల్ క్యాంప్ పేరుతో కడప జైలుకు వెళ్లి అప్రూవర్‌గా మారిన దస్తగిరిని బెదిరించారని, ఇందుకు సంబంధించిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయని కోర్టుకు తెలిపారు. అన్ని వర్గాల వాదనలు విన్న ధర్మాసనం కీలక తీర్పు వెలువరించింది. చట్టాన్ని దుర్వినియోగం చేస్తూ డాక్టర్ సునీత, ఆమె భర్త, రామ్ సింగ్‌పై పులివెందుల పోలీస్ స్టేషన్‌లో నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లను కొట్టివేసింది. అనంతరం, ఈ కేసులో తదుపరి దర్యాప్తు అవసరమా, నిందితులను కస్టడీలోకి తీసుకుని విచారించాలా అనే అంశాలపై స్పష్టత ఇవ్వాలని సీబీఐని ఆదేశించింది. ఎంతమంది నిందితుల బెయిల్ రద్దు చేయాలో కూడా తెలియజేయాలని సూచించింది. తదుపరి విచారణను వచ్చే నెల 9వ తేదీకి వాయిదా వేసింది.ద

# పంట నష్టపోయిన రైతులకు మంత్రి జూపల్లి గుడ్ న్యూస్

- మొదటి పేజీ తరువాయి
కూలిపోయాయని.. పునరుద్ధరించాలని అధికారులను ఆదేశించామని చెప్పారు మంత్రి జూపల్లి. భారీ వర్షాలకు పంట నష్టపోయిన రైతులు మంత్రి జూపల్లి ప్రకటనతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# దుబ్బాక ఎమ్మెల్యే, ప్రభాకర్ రెడ్డికి తిరుపతి ప్రసాదం అందజేత



**ఆగస్టు 19 (సీ కే న్యూస్) చేగుంట:** దుబ్బాక నియోజకవర్గం బిఆర్ఎస్ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డికి చేగుంట మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు
తిరుపతి ప్రసాదాన్ని అందజేసిన, బిఆర్ఎస్ పార్టీ
మాజీ సర్పంచ్ కొటారి అశోక్,మాజీ ఏఎంసీ డైరెక్టర్ కర్నాల్ పల్లి శివ, సీనియర్ నాయకులు,సాయికుమార్, అలం శ్రీకాంత్, మండల సోషల్ మీడియా నాయకులు యాదగిరి, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# ధర్మసాగర్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థుల ఔదార్యం.





**సీకే న్యూస్ ఆగస్టు 19 మంగళవారం హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ప్రతినిధి కమలాకర్:** ధర్మసాగర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు 1978 -1979 బ్యాచ్కు చెందిన 10వ తరగతి విద్యార్థులు ఆరున్నర ఫీట్ల స్టీల్ బీరువాను బహూకరించారు . 47 సంవత్సరాల క్రితం తాము పాఠశాలలో చదువుకున్న ప్రాంతాన్ని నడయాడుతూ, తమ పాఠశాల రోజులను, తమ గురువులను, తమ స్నేహితులను గుర్తు చేసుకున్నారు . ఈ కార్యక్రమంలో ఆ బ్యాచ్కు చెందిన విద్యార్థులు సుదర్శన్ రెడ్డి ,రమేష్ ,దయాకర్ ,సామిల్ ,జయ ప్రకాష్, ఈశ్వర్, రామమూర్తి, శనగం, బుచ్చిమల్లు, చింత శోభ లతోపాటు పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు ధర్మ ప్రకాష్, ఉపాధ్యాయులు కవిత, సురేష్ ,కిరణ్మయి, రామకృష్ణ ,ప్రసన్న ,రమ్యశ్రీ విద్యార్థులు పాల్గొన్నారు.

# సరోజిని వృద్ధాశ్రమంలో ఘనంగా చేతన పుట్టిన రోజు వేడుకలు.





**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ భద్రాచలం ప్రతినిధి, (సాయి కౌశిక్),ఆగస్టు 19,** భద్రాచలంలోని కూనవరం రోడ్డులో ఉన్న సరోజిని వృద్ధాశ్రమంలో చేతన మీసేవ నిర్వాహకులు భూక్యా రంజిత్ నాయక్ తన కుమార్తె చేతన భూక్యా జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు . ఈ కార్యక్రమాని కి అంతర్జాతీయ ఫోటోగ్రాఫర్ క్లాసిక్ షరీఫ్, పట్టణ ప్రముఖులు కొప్పుల మురళి, జిందా ముఖ్య అతిథులుగా హాజరై అన్నదానం చేశారు. చేతన పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని వారు ఆకాంక్షించారు. అదేవిధంగా, ప్రభుత్వ ఉపాధ్యాయులు దారావత్ భాస్కర్, ఆశ దంపతుల కుమారుడు జెస్సిక్ కార్తికేయ పుట్టినరోజు వేడుకలను కూడా ఇదే వృద్ధాశ్రమంలో నిర్వహించారు. ఈ వేడుకల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుడు మాన్ సింగ్, చేతన మీసేవ నిర్వాహకులు భూక్యా రంజిత్ నాయక్, వసంత, భాస్కర్, ఆశ తదితరులు పాల్గొన్నారు. తమ పిల్లల పుట్టినరోజుల ను వృద్ధాశ్రమంలో జరుపుకోవడం ద్వారా వారు తమ సామాజిక బాధ్యతను చాటుకున్నారు.

# ఆగస్ట్ 25 సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో రౌండ్ టేబుల్ సమావేశం విజయవంతం చేయండి.

**ముఖ్య అతిథి రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం.**



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్), ఆగస్ట్ 19,** షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట సమితి ఎస్సి హెచ్ పి ఎస్ ఆధ్వర్యంలో కొత్తగూడెం సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు బొమ్మెర శ్రీనివాస్ మాట్లాడారు. ఈనెల 25 న హైదరాబాద్ సోమాజి గూడ ప్రెస్ క్లబ్బులో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేయటం జరిగిందని వెల్లడించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథి తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగారి ప్రీతం పాల్గొంటారని వెల్లడించారు. ఉద్యమంలో కలిసివచ్చే ఉద్యమకారులు, ప్రజా ప్రతినిధులు వివిధ పార్టీల నాయకులు, కుల సంఘాల పెద్దలు, మేధావులు, విద్యావంతులు, యువకులు కళాకారులు, గతంలో ఏజెన్సీ మండలాల్లో జడ్పిటిసిలుగా, ఎంపీటీసీలుగా పదవులు అనుభవించిన మాజీ ప్రజా ప్రతినిధులు తప్పకుండా హాజరుకావాలని కోరారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక ఏజెన్సీ భూభాగంలో స్థానికంగా నివసిస్తున్న ఎస్సీ కులాలకు రాజ్యాంగపరమైన రాజకీయ రిజర్వేషన్ తో పాటు నివాసముంటున్న ఇంటిపైన, సాగు చేస్తున్న భూములకు హక్కులు కల్పించాలని,ఉద్యోగ ఉపాధి అవకాశాలు అభివృద్ధి లో వెనుకబడ్డ నిరుపేదలై ఎస్సీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు కల్పించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోద రమేష్,ఏ ప్రవీణ్ కుమార్, కండే రాములు, తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ నాయకులు మ్యాచెస్, మాదిగ ఐక్య సంఘాల వేదిక సుజాతనగర్ మండల అధ్యక్షులు వేల్పుల భాస్కర్, షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట సమితి జిల్లా నాయకులు, రాజయ్య, సిహెచ్ గోపికృష్ణ, కుంపటి నాగరాజు, బి శివ,ప్రకాష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఫోటో గ్రాఫి దినోత్సవ వేడుకలు





**సి కె న్యూస్ ఆత్మకూర్ యం రిపోర్టర్ షేక్ అజీజ్ :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూర్ ఎం మండల కేంద్రంలో ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు యాస సుభాష్ రెడ్డి ఆధ్వర్యంలో 186వ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్నిపురస్కరించుకొని కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు,అనంతరం స.ఈ కార్యక్రమంలో ఆత్మకూర్ మండల ప్రధాన కార్యదర్శి ఎలాగందుల మహేష్, జిల్లా సలహాదారులు గజరాజు కాశినాథ్, జిల్లా కార్యవర్గ సభ్యులు కట్టేకోల రమేష్, మండల గౌరవ అధ్యక్షులు ఉగ్గే నరేష్,కార్యవర్గ సభ్యులు రంగ పరుశరాములు, వంగరి మహా ఋషి,కొండపల్లి సాంబా, నాగుల నరేష్, నాగరాజు, చిత్రాల అనిల్ గౌడ్, ఎస్.కె ముస్తఫా, వేముల నవీన్, చెరుకు శివాజీ కోల సాయి అఖిల్, కట్టెకోల ప్రవీణ్, ఎలిమినేటి శ్రీకాంత్ ఓకే ప్రమోద్, సాయి తదితరులు పాల్గొన్నారు.

# కే హెచ్ ఆర్ ఫౌండేషన్ నుంచి మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం..



**సి కె న్యూస్ ఆత్మకూర్ యం రిపోర్టర్ షేక్ అజీజ్ :** యాదాద్రి భువనగిరి:- జిల్లా ఆత్మకూరు (యం)మండలం కొరటికల్ గ్రామానికి చెందిన కట్టెకోల ప్రభాకర్ ప్రమాదవశాత్తు మరణించడం జరిగింది వారి కుటుంబాన్ని కొరటికల్ తాజా మాజీ సర్పంచ్ కోల సత్తయ్య గౌడ్ పరామర్శించి కే హెచ్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్ %బ% బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కొప్పుల హరిదీప్ రెడ్డి గారి సహాయంతో వారి కుటుంబానికి 5000? రూపాయల ఆర్థిక సహాయాన్ని గ్రామ శాఖ ఆధ్వర్యంలో అందజేశారు ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు నరకుడు బిందెల సైదులు, మాజీ సర్పంచ్ పెండెం పురుషోత్తం, బిఆర్ఎస్వి మండల అధ్యక్షులు చుంచు నాగరాజు, గౌడ సంఘం మాజీ అధ్యక్షులు బస్వ వీరస్వామి గౌడ్,మాజీ వార్డు సభ్యులు ఎలిమినేటి గోపాల్, సీనియర్ నాయకులు జోగు స్వామి, కుమ్మరి కుంట్ల యాదయ్య, కోల నరేష్, బొంత విగ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

# యూరియా కోసం రైతన్న క్యూ లైన్



**ఆగస్ట్ 19 (సి కే న్యూస్) చేగుంట:** చేగుంట మండల కేంద్రంలోని మక్కరాజ్ పేట రోడ్ లో గల
శ్రీ, ఆంజనేయ రైతు సేవకేంద్రం వద్ద,రైతులు, యూరియా కోసం అర కిలోమీటర్ వరకు క్యూ లైన్ గా,పద్ధతితో నిలిచి ఉన్నారు రైతులు పాస్ బుక్ మరియు ఆధార్ కార్డులు, పట్టుకొని వర్షంలోనే నిలచి ఉన్నారు, ఈ విషయం తెలుసుకున్న దుబ్బాక నియోజకవర్గ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, చేగుంట రైతు సేవ కేంద్రానికి, చేరుకొని వ్యవసాయ అధికారులతో మాట్లాడుతూ యూరియా కోసం రైతులు క్యూ ఉండగా రైతులకు ఇబ్బంది కలుగకుండా చూడాలి అన్నారు, తక్షణమే అధికారులతో మాట్లాడి యూరియా సమస్యలు తీర్చాలని అన్నారు,
అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత తీవ్రమైన యూరియా కొరత ఏర్పడిందని, యూరియా సరఫరా చేయడంలో పూర్తిగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయి, రైతులు ప్రభుత్వాన్ని నిలదీసిన పట్టించుకోవడం లేదన్నారు, ఈ కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ నాయకులు, చిన్న శివునూర్ మాజీ సర్పంచ్ అశోక్,మాజీ ఎంపీటీసీ లక్ష్మి డాక్టర్ రమేష్, ఊరడి యాదగిరి, బాలశెట్టి శివ, ఆలం శ్రీకాంత్, సాయి, బిఅర్ఎస్ పార్టీ నాయకులు ఆనంద్ గౌడ్, శ్రీను, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# ఖరీఫ్ 2025-26 సీజన్ కు పంట ఉత్పత్తులపై కనీస మద్దతు ధర పెంపు.....

- అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి
- నిర్దేశించిన మద్దతు ధరకు రైతులు పంటను విక్రయించాలి

**సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం, ఆగస్టు -19:** భారత ప్రభుత్వం ఖరీఫ్ 2025-26 సీజన్ కు పంట ఉత్పత్తులపై కనీస మద్దతు ధర పెంచడం జరిగిందని, నిర్దేశించిన మద్దతు ధరకు రైతులు తమ పంటను విక్రయించాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్వింటాకు వరి కామన్ గ్రేడ్ రూ. 2369, గ్రేడ్ ఏ రూ. 2389, జొన్నలు హైబ్రిడ్ రూ. 3699, మాల్దండి రూ. 3749, సజ్జలు రూ. 2775, రాగులు రూ. 4886, మొక్కజొన్న రూ. 2400, కందులు రూ. 8000, పెసర్లు రూ. 8768, మినుములు రూ. 7800, పల్లికాయ రూ. 7263, పొద్దు తిరుగుడు గింజలు రూ. 7721, సోయాబీన్ ఎల్లో రూ. 5328, నువ్వులు రూ. 9846, నైజర్ సీడ్ రూ. 9537, పత్తి పొడగాటి మధ్య రకం (29.5-30.5) రూ. 8110, మధ్య రకం (24.5- 25.5) రూ. 7710 రూపాయలు మద్దతు ధరగా నిర్ణయించడం జరిగిందని అదనపు కలెక్టర్ తెలిపారు. మద్దతు ధర అంశాన్ని రైతులు గమనించి తమ పంట ఉత్పత్తులను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో అమ్ముకొని కనీస మద్దతు ధర పొందాలని, అదనపు కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



## ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా అధ్యక్షున్ని సన్మానించిన, అయిత పరంజ్యోతి



**ఆగష్టు 19 ( సీ కే న్యూస్) చేగుంట**
చేగుంట మండల్ కేంద్రంలో మంగళవారం నాడు ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం ఘనంగా నిర్వహించి, పోటోగ్రపీ మండల అధ్యక్షునీ, సంఘ సేవకులు అయిత పరంజ్యోతి శాలువాతో సన్మానించారు, అయిత పరంజ్యోతి మాట్లాడుతూ మీకు ఏమన్నా సమస్యలు ఉంటే తమతో తెలుపగలరని అన్నారు. ప్రభుత్వ పరంగా సాయ సహకారాలు అందించే విధంగా తప్పక కృషి చేస్తానని వారు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో,అయిత పరంజ్యోతి పోటో గ్రేప్ అధ్యక్షుడు నరసింహ గౌడ్, కార్యదర్శి ఆరుట్ల పోచయ్య, పోటో గ్రేప్ యూనియన్,సభ్యులు తదితరులు పాల్గొనారు

## పవర్ లిఫ్టింగ్ చరిత్రలో కొత్త అధ్యయనాన్ని సృష్టించిన క్రీడాకారున్ని అభినందించిన భద్రాచలం సీఐ.

- సిటీ స్టైల్ జిమ్ కోచ్ జివి రామిరెడ్డి.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),ఆగస్టు 19,** కేరళ రాష్ట్రంలో ఆగస్టు 2 నుండి 7 వరకు జరిగిన జాతీయ స్థాయి మాస్టర్స్ పవర్ లిఫ్టింగ్ పోటీలలో పవర్ లిఫ్టింగ్ ఆఫ్ ఇండియా చరిత్రలో సరికొత్త అధ్యయనాన్ని సృష్టించడమే కాకుండా 4 బంగారు పతకాలు సాధించిన భద్రాచలం సిటీస్టైల్ జిమ్ క్రీడాకారుడు డివి శంకర్రావు ను భద్రాచలం సర్కిల్ ఇన్స్పెక్టర్ నాగరాజు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 73 సంవత్సరాల వయసులో హార్ట్ బైపాస్ సర్జరీని సైతం లెక్క చేయకుండా ఆరు నెలల అనతి కాలంలోనే జిల్లా, రాష్ట్రస్థాయిలో సత్తా చాటి కేరళ రాష్ట్రంలో జరిగిన జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలలో నాలుగు బంగారు పతకాలు సాధించి తెలంగాణ రాష్ట్రానికి కీర్తి ప్రతిష్టలను తెచ్చారని ఈ సందర్భంగా తెలిపారు. పట్టుదల ఉంటే సాధించలేనిది ఏమీ లేదని గుర్తు చేశారు. డివి శంకర్రావుకు శిక్షణ ఇచ్చిన భద్రాచలం సిటీ స్టైల్ జిమ్ కోచ్ జి వి రామిరెడ్డి ని మరియు మరొక ఇంటెన్సివ్ ట్రైనర్ డాక్టర్ శివరామ కృష్ణ ప్రసాద్ ని మరియు ప్రత్యక్షంగా పరోక్షంగా ఆయన వెంటే ఉండి నిత్యం నడిపించే మహంతి వెంకటకృష్ణాజీని, గుగులోతు శోభనాయక్ ని కూడా అభినందించారు. ఇంటర్నేషనల్ పోటీల్లో కూడా రాణించి ఇండియాకు మంచి కీర్తి ప్రతిష్టలను తీసుకురావాలని సూచించారు. డెబ్బై మూడు సంవత్సరాల వయస్సు లొ జాతీయ స్థాయి లొ బంగారు పతకాలు సాధించి యువత కి ఆదర్శం గా నిలిసిన వ్యక్తి అని సర్కిల్ ఇన్స్పెక్టర్ నాగరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలొ ఎస్ ఐ రామకృష్ణ, ఎస్ ఐ గంజి స్వప్న కోచ్ జీ వి రామిరెడ్డి, డాక్టర్ శివ రామ కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

# పాడి పశువుల కొనుగోలులో నిబంధనలు పాటించాలి

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ
- లబ్ధిదారుల ఆమోదంతో పాడి పశువులను ఫైనల్ చేయాలి
- ప్రతి పాడి పశువుకు బీమా సౌకర్యం కల్పించాలి
- ఇందిరా మహిళా డైయిరీపై సమావేశం నిర్వహించిన అదనపు కలెక్టర్



**సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం, ఆగస్టు -19:**పాడి పశువుల కొనుగోలులో నిబంధనలు పాటించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ అన్నారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, ఇందిరా మహిళా డైయిరీ గ్రౌండింగ్ పై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ ఇందిరా మహిళా డైయిరీ గ్రౌండింగ్ లో భాగంగా ఒక్కో లబ్ధిదారుకు 2 పాడి పశువుల చొప్పున పంపిణీ చేయాల్సి ఉంటుందని, పాడి పశువుల కొనుగోలు కోసం కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందని, పాడి పశువుల కొనుగోలు, రవాణా, భీమా సౌకర్యం కల్పన, తదితర అంశాలలో పాటించాల్సిన విధానాలపై చర్చించి, పలు సూచనలు చేశారు. పాడి పశువుల పంపిణీతో పాటు అవసరం, అవకాశం ఉన్న చోట ఉపాధి హామీ పథకం నిధులు వినియోగించుకుంటూ పశువుల షెడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు. మన జిల్లాలో ఉన్న వాతావరణంకు అలవాటు పడే పశువులను కొనుగోలు చేయాలని, పాడి పశువులు కొనుగోలులో నిర్దేశిత నిబంధనలను అధికారులు తూ.చా. తప్పకుండా పాటించాలని, రవాణా కోసం పటిష్ట చర్యలు తీసుకోవాలని అన్నారు.

బ్యాంకుల వారీగా లబ్దిదారుల కేటాయింపు, జాయింట్ ఖాతా ప్రారంభం నిర్దేశిత లక్ష్యం ప్రకారం పూర్తి కావాలని అన్నారు. పశువుల కొనుగోలు పూర్తయిన తర్వాత బ్యాంకు ఖాతా ద్వారా చెల్లింపులు చేయాలని అన్నారు. ప్రతి మండలంలో లబ్ధిదారులకు ఎక్కడి నుంచి పాడి పశువులు కొనుగోలు చేయాలి అనే అంశం ఫైనల్ చేయాలని అన్నారు.

రాబోయే శుక్రవారం నుంచి పాడి పశువుల కొనుగోలు ప్రక్రియ ప్రారంభం కావాలని అదనపు కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. పాడి పశువులు ఫైనల్ చేయడానికి లబ్ధిదారులను కూడా తీసుకొని వెళ్ళాలని, వారి ఆమోదంతోనే తుది పశువుల ఎంపిక ఉంటుందని అన్నారు. ప్రతి పాడి పశువుకు భీమా సౌకర్యం కల్పించాలని అన్నారు.

పాడి పశువుల కొనుగోలు 2 నుంచి 3 రోజులు పట్టే అవకాశం ఉన్నందున, అక్కడ వసతి సౌకర్యాలను ముందస్తుగానే ప్లాన్ చేసుకోవాలని అన్నారు. కొనుగోలు చేసిన ప్రతి పాడి పశువుకు జియో ట్యాగ్ వేయాలని, ఎటువంటి అక్రమాలకు ఆస్కారం ఇవ్వకుండా జాగ్రత్తలు పాటించాలని, కొనుగోలు చేసే ప్రతి పాడి పశువు ఆరోగ్య స్థితిగతులను వెటర్నరీ డాక్టర్ పరిశీలించాలని అన్నారు.

ఈ సమావేశంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సన్యాసయ్య, ఎస్సీ, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, ఎంపీడీవోలు, బ్యాంకు అధికారులు, వివిధ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ పథకాల మీద అవగాహన కలిగి ఉండాలి....

జిల్లా ఉపాధి అధికారి కే శ్రీ రామ్....!



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ పాల్వంచ ప్రతినిధి, (సాయి కౌశిక్),ఆగస్టు 19,** ప్రభుత్వ డిగ్రీ అటానమస్ కళాశాల పాల్వంచలో కేంద్ర ప్రభుత్వం అందిస్తున్నటువంటి వివిధ రకాల పథకాల పైన మేరా యువభారత్ అకౌంటెంట్ ప్రోగ్రాం ఆఫీసర్ కే భానుచందర్ మరియు కళాశాల కామర్స్ మరియు కెరియర్ గైడెన్స్ సెల్ ఆధ్వర్యంలో వర్క్ షాపును నిర్వహించడం జరిగింది, ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ పమ పోలారపు పద్మ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ముఖ్యంగా అందించేటువంటి ఫ్లాగ్ షిప్ స్కీముల పైన ముఖ్యంగా ముద్ర లోన్లు,విశ్వకర్మ పథకము, డిజిటల్ ఇండియా, ప్రధానమంత్రి ఉజ్వల యోజన, స్వచ్ఛభారత్ ఇటువంటి ముఖ్యమైన పథకాల మీద అందరూ అవగాహన కలిగి ఉండాలని తద్వారా డిగ్రీ అయిపోయిన తర్వాత మీరు స్వయం ఉపాధిని పొందడంతో పాటు నలుగురికి ఉపాధి అవకాశాలను కల్పించవచ్చని, విద్యార్థులు అందరూ వీటి పైన అవగాహన పెంచుకొని తమ తమ గ్రామాలలో ఈ పథకాలను విస్తృతంగా ప్రచారం చేయాలని ఆమె తెలియజేశారు. ముఖ్యఅతిథిగా విచ్చేసినటువంటి జిల్లా ఉపాధి అధికారి కే శ్రీరామ్ మాట్లాడుతూ.. డిగ్రీ మూడో సంవత్సరం విద్యార్థులందరూ కేంద్ర ప్రభుత్వము అందిస్తున్నటువంటి వివిధ పథకాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని, అదేవిధంగా విద్యార్థులందరూ స్కిల్ కోర్సులను సాఫ్ట్ స్కిల్స్ నేర్చుకుని ఇంగ్లీషులో మంచి ప్రావీణ్యం పొందిన తర్వాత మంచి మంచి కార్పొరేట్ సంస్థలలో లక్షల రూపాయల ప్యాకేజీతో జాబ్లో జాయిన్ అవ్వచ్చు అని ప్రతి నెల డిస్ట్రిక్ట్ లో జరుగుతున్నటువంటి జాబ్ మేళాకు అందరూ అటెండ్ అయ్యి వివిధ సంస్థలలో ఉన్నటువంటి ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. మరొక ముఖ్యఅతిథి లీడ్ బ్యాంకు మేనేజర్ రామిరెడ్డి మాట్లాడుతూ.. బ్యాంకులు స్వయం ఉపాధి పొందడానికి ఇచ్చేటువంటి ముద్ర లోన్స్ విశ్వకర్మ లోన్స్ ను అందరూ కూడా సద్వినియోగం చేసుకోవాలని దీనికి ఎటువంటి సెక్యూరిటీ అవసరంలేని లోన్లు అని వివిధ బ్యాంకులు ఎటువంటి సెక్యూరిటీ లేకుండా లోన్లు సులువుగా పొందవచ్చు అని అదేవిధంగా లోన్లు తీసుకునేవాళ్లు డైరెక్ట్ గా బ్యాంకు ద్వారానే తీసుకోవాలని మధ్యవర్తులని నమ్మొద్దు అని మోసం చేసే అవకాశాలు ఉంటాయని ఆన్లైన్ మోసాల గురించి కూడా ఆయన వివరించారు. ఈ పథకాలను వివరించడానికి కామర్స్ డిపార్ట్మెంట్ పారెల్లి శ్రీనివాస్ మరియు కంప్యూటర్ డిపార్ట్మెంట్ హెచ్ ఓ డి కోటగిరి రాంబాబు లు స్లైడ్ షో ద్వారా ఈ పథకాల గురించి సవివరంగా తెలియజేశారు. అనంతరం ముఖ్య అతిథులకు సన్మానం చేయడం ద్వారా కార్యక్రమం ముగించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల సూపరింటెండెంట్ విజయ ప్రసాద్ డాక్టర్ టి అరుణకుమారి డాక్టర్ శెట్టి స్వరూప రాణి డాక్టర్ కొండలరావు విమల దీపిక హారిక సౌమ్య ధర్మారావు ఈ శ్రీను బి రమేష్ హరికృష్ణ పవన్ భాను పర్వీన్ తేజస్విని మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# ఓయూ డాక్టరేట్ పొందిన స్పోర్ట్స్ అథారిటీ ఎండి సోని బాలదేవి

పలువురి అభినందనలు



**సి కె న్యూస్ ప్రతినిధి:**తెలంగాణ ప్రాధికార సంస్థ వైస్ చైర్మెన్ మేనేజింగ్%d% డైరెక్టర్ శ్రీమతి ఏ సోనీ బాలాదేవి ప్రతిష్టాత్మక ఉస్మానియా యూనివర్సిటీ నుండి డాక్టరేట్ పట్టా పొందింది.

ఉస్మానియా విశ్వవిద్యాలయం డిపార్ట్మెంట్ ఆఫ్ సైన్స్ బాటనీ విభాగంలో

తెలంగాణ రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి సేకరించిన జిమ్నీమా సిల్వెస్ట్రే లోని ఫైటోకెమికల్ సమ్మేళనాల పెరుగుదలలో ట్రైకోడెర్మా ప్రభావిత్వంపై అధ్యయనాలు అన్న అంశంపై ఆమె పరిశోధనా పత్రానికి యూనివర్సిటీ డాక్టర్ రేట్ తో సత్కరించింది.

తెలంగాణ రాష్ట్ర గవర్నర్, యూనివర్సిటీ ఛాన్సర్ జిష్ణు దేవా శర్మ మరియు ఉస్మానియా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎం కుమార్ ల చేతుల మీదుగా ఈ డాక్టరేట్ పట్టా ప్రధానం జరిగింది

**అభినందించిన క్రీడామంత్రి**

క్రీడలు మరియు యువజన సేవల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి,తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఛైర్మన్ శివసేన రెడ్డి , డాక్టర్ సోనిబాలా దేవికి హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఉద్యోగులు సిబ్బంది కోర్సులు అధికారులు డాక్టర్ సోనిబాలా దేవికి శుభాకాంక్షలు తెలియజేసారు.

# కోడిగుడ్ల సరఫరా ఈ-టెండర్లు ఓపెన్ చేసిన అదనపు కలెక్టర్



**సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం, ఆగస్టు -19:**ఖమ్మం జిల్లాలో మధ్యాహ్న భోజనం మినహాయించి అన్ని గురుకుల విద్యాసంస్థలు (బీసీ, ఎస్సి, ఎస్టీ, మైనారిటీ), అంగన్వాడీ కేంద్రాలకు కోడిగుడ్ల సరఫరా కోసం ఆహ్వానించిన టెండర్ లలో 3 ఈ-టెండర్లు దాఖలు అయ్యాయని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ తెలిపారు.

కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, మంగళవారం కోడిగుడ్లు సరఫరా ఈ టెండర్లను ఓపెన్ చేశారు.

ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ అన్ని గురుకుల విద్యాసంస్థలు, అంగన్వాడీ కేంద్రాలకు రెగ్యులర్ గా కోడిగుడ్లు సరఫరా చేసేందుకు ఏజెన్సీల నుంచి టెండర్లు ఆహ్వానించామని, నితిషా పౌల్ట్రీ ఫార్మ్స్, వెంకట్రామ పౌల్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్, పి.వి.ఎస్.ఎస్. పౌల్ట్రీ లిమిటెడ్ అను మూడు సంస్థల నుంచి ఈ టెండర్లు దాఖలు అయ్యాయని అన్నారు. ఆన్ లైన్ లో నమోదు చేసిన ఈ టెండర్లలో ఒక కోడిగుడ్డుకు వెంకట్రామ పౌల్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ 5.99 రూపాయలు, నితిషా పౌల్ట్రీ ఫార్మ్స్ 6.27 రూపాయలు, పి.వి.ఎస్.ఎస్. పౌల్ట్రీ లిమిటెడ్ 6.66 రూపాయలకు కోట్ చేస్తూ ఈ టెండర్లు వేశారు.

నిబంధనలను పాటిస్తూ, తక్కువ ధరకు కోడి గుడ్లు సరఫరా చేసే వారికి టెండర్ అందించడం జరుగుతుందని అన్నారు. అనంతరం టెండర్ సంబంధించి సరఫరాదారులకు ఉన్న సందేహాలను అదనపు కలెక్టర్ నివృత్తి చేశారు. ఈ సమావేశంలో సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ కస్తాల సత్యనారాయణ, జిల్లా బిసి అభివృద్ధి అధికారిణి జి. జ్యోతి, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి డా. బి. పురందర్, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎన్. విజయలక్ష్మి, జిల్లా విద్యాశాఖ అధికారిణి కే. నాగ పద్మజ, జిల్లా సంక్షేమ అధికారి కే. రాంగోపాల్ రెడ్డి, జిల్లా మార్కెటింగ్ అధికారి ఎం.ఏ. అలీమ్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎఫ్.ఆర్.ఎస్. హాజరు నమోదు కట్టుదిట్టంగా నమోదు చేయాలి....

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ
- ఎఫ్.ఆర్.ఎస్. విధానంలో హాజరు నమోదుపై విద్యా శాఖ అధికారులతో సమావేశం నిర్వహించిన అదనపు కలెక్టర్



**సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం, ఆగస్టు -19:**ప్రభుత్వ పాఠశాలల్లోనీ విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఎఫ్.ఆర్.ఎస్. ద్వారా హాజరు కట్టుదిట్టంగా నమోదు చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ అన్నారు.

కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, ఎఫ్.ఆర్.ఎస్. విధానంలో హాజరు నమోదుపై విద్యాశాఖ అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ విద్యా శాఖ పరిధిలో వచ్చిన నిధులను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. పాఠశాలల వారీగా పారిశుద్ధ్య నిర్వహణ మెరుగు పర్చాలని అన్నారు. భవిత కేంద్రాల మరమ్మత్తు అభివృద్ధి పనులు వెంటనే చేపట్టాలని అన్నారు.

పాఠశాలలో విద్యార్థుల గైర్హాజరుకు గల కారణాలు తెలుసుకొని, ఫాలో అప్ చేస్తూ విద్యార్థులు ప్రతిరోజు పాఠశాలకు వచ్చే విధంగా చూడాలని, ఉపాధ్యాయులకు సెలవు మంజూరు అంశంలో ప్రణాళికా బద్ధంగా వ్యవహరించాలని అన్నారు. టీచర్లు, విద్యార్థుల హాజరు అంశం అత్యంత ప్రాధాన్యతగా పరిగణించడం జరుగుతుందని అన్నారు. ప్రతి వారం తక్కువ ఎఫ్.ఆర్.ఎస్. ఉన్న 5 మండలాల కాంప్లెక్స్ పరిధిలో ఎఫ్.ఆర్.ఎస్. అమలు, పాఠశాల నిర్వహణ పట్ల సమీక్ష నిర్వహించుకోవాలని అన్నారు. యూ.డి.ఐ.ఎస్.ఈ. పోర్టల్ లో పాఠశాలకు సంబంధించి వివరాలను అప్ డేట్ చేయాలని, ఎం.ఐ.ఎస్. కో ఆర్డినేటర్లు, హెడ్ మాస్టర్ లతో సమన్వయం చేసుకుంటూ వివరాలు నమోదు చేయాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ఆగస్టు చివరి నాటికి అపార్ నెంబర్ జనరేట్ చేయాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారిణి నాగ పద్మజ, విద్యాశాఖ ప్లానింగ్ కో ఆర్డినేటర్ రామకృష్ణ, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# గ్రంథాలయాల నిర్వహణకు కట్టుదిట్టమైన చర్యలు...



స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ

గ్రంథాలయ సంస్థ సర్వసభ్య సమావేశం లో పాల్గొన్న అదనపు కలెక్టర్

**సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం, ఆగస్టు -19:**గ్రంథాలయాల నిర్వహణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో మంగళవారం నిర్వహించిన గ్రంథాలయ సంస్థ సర్వసభ్య సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పాల్గొన్నారు.

2025-26 బడ్జెట్ ఖర్చు చేయుటకు ఆమోదం, నూతన ప్రతిపాదనలు, నేలకొండపల్లిలో నూతన భవన నిర్మాణం, ఖమ్మం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో అదనపు నూతన భవన నిర్మాణం, పోటీ పరీక్షల పుస్తకాల కొనుగోలు వంటి పలు అంశాలపై చర్చించి అదనపు కలెక్టర్ పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ 2025-26 సంవత్సరానికి సంబంధించి ఖమ్మం జిల్లా గ్రంథాలయ సంస్థ బడ్జెట్ ఖర్చు చేసేందుకు పౌర గ్రంథాలయ శాఖ సంచాలకులు ఆమోదం తెలపడం జరిగిందని, నేలకొండపల్లిలో నూతన గ్రంథాలయ భవన నిర్మాణం పూర్తి చేసేందుకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 22 లక్షల 60 వేల రూపాయలు టి.ఎస్.ఈ. డబ్ల్యూ.ఐ.డి.సి. కి చెల్లించుటకు పౌర గ్రంథాలయ సంచాలకులకు ప్రతిపాదనలు సమర్పించాలని అదనపు కలెక్టర్ తెలిపారు.

గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నడిచే గ్రంథాలయాల నందు పోటీ పరీక్షల పుస్తకాలు కొనుగోలు చేయాలని అన్నారు. ఖమ్మం జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో నిరుపయోగంగా ఉన్న వాటర్ ప్యూరిఫైయర్ మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని అన్నారు.

ఖమ్మం నగరంలో 2 కోట్ల రూపాయలతో చేపట్టిన జిల్లా కేంద్ర గ్రంథాలయ అదనపు భవన నిర్మాణం పనులకు గత ఆర్థిక సంవత్సరం 50 లక్షల రూపాయలు చెల్లించడం జరిగిందని, ప్రస్తుత సంవత్సరం మరో ఒక కోటి 50 లక్షల రూపాయలు ఖర్చులు చెల్లించుటకు పౌర గ్రంథాలయ శాఖ సంచాలకులకు ప్రతిపాదనలు సమర్పించాలని తెలిపారు.

ఈ సమావేశంలో గ్రంథాలయ కార్యదర్శి కె. కరుణ, డిడి వయోజన విద్య అనిల్, జిల్లా విద్యాధికారినాగ పద్మజ, జిల్లా పంచాయతీ అధికారిణి ఆశాలత, అదనపు పౌరసంబంధాల అధికారి ఆయూబ్ ఖాన్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# గౌతమి ఘాట్ ఫోటోగ్రాఫర్స్ ఆధ్వర్యంలో ఘనంగా ఫోటోగ్రాఫర్స్ - డే.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/భద్రాచలం ప్రతినిధి,( సాయి కౌశిక్),ఆగస్టు 19,**ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ సందర్భంగా పట్టణం లోని గోదావరి కరకట్ట వద్ద గౌతమీ ఘాట్ ఫోటో గ్రాఫర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఫోటో గ్రఫీ పితామహుడుజోసెఫ్ నిసెఫోర్ నీప్సే చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. అనంతరం యూనియన్ నాయకులు మాట్లాడుతూ... ఫోటోగ్రఫీ లో ఉన్న సమస్యలపై సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా ఫోటో గ్రాఫర్లకు రాష్ట్ర ప్రభుత్వం ప్రమాద బీమా కార్డులు మంజూరు చేయాలని కోరారు.

# ఘనంగా ఫోటోగ్రఫీ డే

**పలమనేరు ఆగస్టు 19 సీకే న్యూస్:** పలమనేరు:పట్టణం క్లాక్ టవర్ వద్ద మంగళవారం ఫోటోగ్రఫీ డే ని ఘనంగా సెలబ్రేట్ చేశారు ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ సభ్యులు.



ఫోటో కెమెరా సృష్టికర్త “లూయిస్ డాగురె” చిత్రపటానికి పూలమాలలువేసి పూజలు చేసి కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు, అనంతరం డాగురె అమర్ రహే అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ పెద్దలను గౌరవంగా సత్కరించుకున్నారు.

లూయిస్ డాగురె అనే వ్యక్తి లేకుండా ఉంటే ప్రపంచవ్యాప్తంగా ఫోటో వృత్తి అనేది లేకుండా ఎన్నో లక్షల మందికి జీవనోపాధి ఉండేకాదని ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పలమనేరు ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కార్యదర్శి సభ్యులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్



**సి కె న్యూస్ ఆగస్టు 19 మంగళవారం హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ప్రతినిధి కమలాకర్:** వర్షాకాల సీజనల్ వ్యాధుల పట్ల వైద్యాధికారులు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ అన్నారు.

ఈ సందర్భంగా వైద్యసేవల నిమిత్తం ప్రతిరోజు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఎంతమంది వస్తుంటారని కలెక్టర్ అడిగి తెలుసుకుని ఇన్ పేషెంట్ ఔట్ పేషెంట్ కు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో జ్వరాల కేసుల నమోదు, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఏ విధమైన చర్యలు తీసుకుంటున్నారు, ఏయే వ్యాధులకు సంబంధించిన రిపోర్టులను ఏ విధంగా తెప్పించుకుంటున్నారనే వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సంబంధించి కావాల్సిన మందుల ఇండెంట్ ను సంబంధిత పోర్టల్ లో ఏ విధంగా నమోదు చేస్తున్నారని కలెక్టర్ పరిశీలించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని మందుల నిల్వను పరిశీలించారు. అదేవిధంగా టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఇప్పటివరకు ఎంతమందికి వైద్య పరీక్షలు నిర్వహించారని, హై రిస్క్ గ్రూపుల వారికి స్క్రీనింగ్ పరీక్షలు ఏ విధంగా నిర్వహిస్తున్నారని వైద్యాధికారిని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. టీవీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఇప్పటివరకు 820 మందికి స్క్రీనింగ్ పరీక్షలు చేశామని, ఇందులో 84 మందికి ఎక్రే పరీక్షలు నిర్వహించామని వైద్యాధికారి డాక్టర్ అరుణ దేవి కలెక్టర్కు తెలియజేశారు. కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ హై రిస్క్ గ్రూపుల వారికి స్క్రీనింగ్ పరీక్షలు ఎక్కువగా నిర్వహించాలని సూచించారు. ప్రణాళిక మేరకు ఎక్కువ సంఖ్యలో స్క్రీనింగ్ పరీక్షలు చేయాలన్నారు. గ్రామాలలో జ్వర సర్వే ను నిర్వహించాలన్నారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలకు అవగాహన ఇప్పించాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ అరుణ దేవి ,ఆయుష్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జగదీశ్వర్ ప్రసాద్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# నా ఇల్లును బలవంతంగా మార్టిగేజ్ చేసుకున్న మార్వాడి ల పై చర్యలను తీసుకొండి


- రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ కు బాధితులు యాదగిరి,స్వరూపల విన్నపం



**సి కె న్యూస్ ప్రతినిధి:**బలవంతంగా నా ఇల్లును మార్టిగేజ్ చేసుకొని 50 లక్షలకు అమ్మి వేసి మా కుటుంబాన్ని రోడ్డుపాలు చేసిన మర్వాడి ల పై చర్యలు తీసుకోవాలని నగరంలోని జవహర్ నగర్ దమ్మాయిగూడకు చెందిన దళిత దంపతులు యాదగిరి,స్వరూప లు రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కివెంకటయ్య,కమిషన్ సభ్యులు కె.లక్ష్మీ నారయణలకు విన్నవించారు.మంగళవారం నాడు డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ అధ్వర్యంలో బాధితులు రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ కు వినతిపత్రం సమర్పించారు. రిటైర్డ్ ఉద్యోగినైన నాకు అప్పు అవసరం లేదని చెప్పిన మర్వాడి వ్యాపారి రామ్ దెవ్ బాటియా తన రౌడిలను నా ఇంటికి పంపి ఇంటి కాగితాలను బలవంతంగా తీసుకొని పోయి మార్టిగేజ్ చెయించి 50 లక్షలకు నా ఇల్లు ను అమ్ముకున్నారని బాదితుడు యాదగిరి ఆవేదన వ్యక్తం చేశారు. మార్వాడి ల పై జవహర్‌నగర్ పోలీసులకు పిర్యాదు చేయగా కేసు నమోదు చేసి పొలీసులు చేతులు దులుపుకున్నారని వివరించారు. ఇందుకు స్పందించిన ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కివెంకటయ్య రాచకొండ పోలీస్ కమిషనర్ కు ఫోన్ చేసి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# నిర్ణీత గడువులోగా పెండింగ్ సిఎంఆర్ రైస్ డెలివరీ పూర్తి చేయాలి... అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి

- 2024-25 వానాకాలం సి.ఎం.ఆర్. రైస్ డెలివరీ సెప్టెంబర్ 12 లోగా పూర్తి చేయాలి
- సీఎంఆర్ రైస్ డెలివరీపై సమీక్షించిన అదనపు కలెక్టర్



**సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం ఆగస్టు -19:** నిర్ణీత గడువులోగా పెండింగ్ సిఎంఆర్ రైస్ డెలివరీ పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి అన్నారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో అదనపు కలెక్టర్, సీఎంఆర్ రైస్ డెలివరీ పై మంగళవారం సంబంధిత అధికారులు, రైస్ మిల్లర్ లతో సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ వానాకాలం 2024-25 పంటకు సంబంధించి సిఎంఆర్ రైస్ డెలివరీ గడువు ప్రభుత్వం నెల రోజులపాటు పొడిగించిందని సెప్టెంబర్ 12 వరకు జిల్లాలో పెండింగ్ ఉన్న 14 శాతం సీఎంఆర్ రైస్ డెలివరీ పూర్తి చేయాలని అన్నారు. ఖమ్మం జిల్లాలో ఖరీఫ్ సీజన్ సంబంధించి లక్షా 98 వేల 69 మెట్రిక్ టన్నులు సి.ఎం.ఆర్. రైస్ డెలివరీ లక్ష్యానికి గాను ఇప్పటి వరకు లక్షా 69 వేల 549 మెట్రిక్ టన్నులు సిఎంఆర్ రైస్ డెలివరీ పూర్తి చేశారని, పెండింగ్ 28 వేల 520 మెట్రిక్ టన్నులు నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అన్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని సమస్యాత్మక కొనుగోలు కేంద్రాలలో అవసరమైన మార్పులు చేసేందుకు ప్రతిపాదనలు పంపాలని అన్నారు.

అనంతరం రైస్ మిల్లుల వారీగా పెండింగ్ ఉన్న సి.ఎం.ఆర్. రైస్ డెలివరీపై సమీక్షించి పలు సూచనలు చేశారు.

ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి చందన్ కుమార్, జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ శ్రీలత, మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షులు బొమ్మ రాజేశ్వర్ రావు, మిల్లర్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ క్రీడా దినోత్సవం ఘనంగా జరపాలి : క్రీడా మంత్రి

- ఆగస్టు 23 నుండి 31 వరకు 9 రోజుల పాటు వేడుకలు
- రోజుకొక వినూత్న కార్యక్రమం
- క్రీడా వేడుకల పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి వాకిటి శ్రీహరి




**సి కె న్యూస్ ప్రతినిధి:**దేశంలో ఏ రాష్ట్రం నిర్వహించినంత ఘనంగా తెలంగాణ రాష్ట్రం జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు నిర్వహించబోతుందని రాష్ట్ర క్రీడలు యువజన సర్వీసుల శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి అన్నారు. మినిస్టర్స్ క్వార్టర్స్ లోని ఆయన నివాసంలో జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలపోస్టర్ ను అయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, దేశంలో ఏ రాష్ట్రం కూడా నిర్వహించినంత ఉత్సాహభరితంగా దాదాపు తొమ్మిది రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా జాతీయ క్రీడ దినోత్సవ వేడుకలను నిర్వహించబోతున్నామని ఆయన అన్నారు.

ఆగష్టు 23వ తేదీ నుండి 31వ తేదీ వరకు హైదరాబాద్ నగరం లోని స్పోర్ట్స్ అథారిటీ క్రీడా ప్రాంగణాలతో పాటు అన్ని జిల్లా కేంద్రాల్లో వివిధ క్రీడా కార్యక్రమాలకు రూపకల్పన చేశామని తెలిపారు ఈ ఉత్సవాలలో ఏడాది వయసున్న పిల్లలనుంచి 70 ఏళ్ల కు పైబడినసీనియర్ సిటిజన్స్ వరకు ఈ కార్యక్రమాలలో పాల్గొనే విధంగా రోజుకొక కార్యక్రమం చొప్పున రూపకల్పన చేశామని తెలిపారు.

క్రీడల పట్ల అవగాహన ఆలోచన ఆచరణ అన్న విధంగా ఈ జాతీయ క్రీడా దినోత్సవాల సందర్భంగా పెద్ద ఎత్తున క్రీడాభిమానులు పాల్గొనే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు యావత్ క్రీడా కుటుంబ సభ్యులు మద్దతు తెలియజేయాలని ఆయన కోరారు. నూతన క్రీడా విధానం 2025 అమలులో భాగంగా జాతీయ క్రీడా దినోత్సవాలను అందర్నీ భాగస్వామ్యం చేస్తూ వివిధ విభిన్న కార్యక్రమాలకు రూపకల్పన జరిగిందని ఆయన వివరించారు. స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి మాట్లాడుతూ, గత సంవత్సరం జాతీయ క్రీడా దినోత్సవాన్ని మూడు రోజులపాటు ఘనంగా నిర్వహించిన ఘనత తెలంగాణ రాష్ట్రానికి దక్కిందని అదేవిధంగా ఈ సంవత్సరం కూడా తొమ్మిది రోజులపాటు ఉత్సవాలు నిర్వహించబోతున్నామని తెలిపారు. పెద్ద ఎత్తున క్రీడాకారులను క్రీడాభిమానులను భాగస్వామ్యం చేయబోతున్నామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ ఎండి డాక్టర్ సోనీ బాలాదేవి, ఖేలో ఇండియా అధికారి డాక్టర్ రవితేజ తదితరులు పాల్గొన్నారు

# వన మహోత్సవం నిర్దేశిత లక్ష్యాన్ని నెలాఖరులోగా పూర్తి చేయాలి...

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి
- ఇందిరా గిరి జల వికాసం అమలు వేగవంతం చేయాలి
- ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల గ్రౌండింగ్ పూర్తి చేయాలి
- వనమహోత్సవం, సీజనల్ వ్యాధులు, ప్రభుత్వ కార్యాలయాల రూఫ్ లపై సోలార్ ప్యానెళ్లు, పారిశుధ్యం, ఇందిరా గిరి జల వికాసం, జల్ జీవన్ మిషన్, ఇందిరమ్మ ఇండ్లపై అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్



**సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం, ఆగస్టు -19:**వనమహోత్సవం క్రింద ఈ సంవత్సరం వివిధ శాఖలకు కేటాయించిన లక్ష్యాలను నెలాఖరుకు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ తో కలిసి వనమహోత్సవం, సీజనల్ వ్యాధులు, ప్రభుత్వ కార్యాలయాల రూఫ్ లపై సోలార్ ప్యానెళ్లు, పారిశుధ్యం, ఇందిరా గిరి జల వికాసం, జల్ జీవన్ మిషన్, ఇందిరమ్మ ఇండ్ల పురోగతి పై జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులు, ఎంపిడివో లు, మునిసిపల్ కమిషనర్లు, ఎంపీవో లతో సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ, జిల్లాకు ఈ సంవత్సరం వనమహోత్సవం క్రింద 35.32 లక్షల మొక్కలు నాటే లక్ష్యంగా ఉండగా, ఇప్పటి వరకు 25.71 లక్షల మొక్కలు నాటామన్నారు. శాఖల వారిగా నిర్దేశించిన లక్ష్యాలు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అవెన్యూ ప్లాంటేషన్ పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. జిల్లాలో మొక్కల పచ్చదనంతో స్పష్టమైన మార్పు రావాలన్నారు. నగరం, పట్టణాల్లో మీడియన్స్ పచ్చదనం తో తీర్చిదిద్దాలన్నారు. గ్రామాల ప్రారంభం వద్ద గ్రామం పేరు, వనమహోత్సవం-2025 బోర్డులు ప్రదర్శించి, గ్రామాల్లో ప్రవేశం వద్ద పచ్చదనంతో ఆహ్లాదకరంగా ఉండేలా చేయాలన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లాలో ఈ సంవత్సరం 75 డెంగ్యూ కేసులు నమోదు కాగా, 52 కేసులు కోలుకున్నాయని, 23 కేసులు యాక్టివ్ గా ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. పాజిటివ్ కేసులు వచ్చిన ఇళ్ళు, పరిసర 60 ఇండ్లలో ఫీవర్ సర్వే, యాంటీ లార్వా చర్యలు చేపట్టాలన్నారు. లక్షణాలున్న వారికి వెంటనే పరీక్షలు చేయాలన్నారు. ఎంపీవో లు క్షేత్ర పర్యటనలు చేసి, పారిశుద్ధ్య చర్యలను పర్యవేక్షణ చేయాలన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలన్నారు. జిల్లాలో 16 వేల 474 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయగా, ఇప్పటి వరకు 12 వేల 574 ఇండ్ల మార్కింగ్ పూర్తిచేసి, వివిధ దశల్లో ఉన్నాయన్నారు. తెలిపారు. మిగులు ఇండ్ల మార్కింగ్ పూర్తి చేయాలన్నారు. పురోగతి లో వెనుకబడ్డ మండలాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ప్రభుత్వం అన్ని ప్రభుత్వ కార్యాలయ భవనాలపై సోలార్ ప్యానెల్ ల ఏర్పాటు దిశగా చర్యలు చేపట్టిందని కలెక్టర్ అన్నారు. సోలార్ ప్యానెల్ ల ఏర్పాటుకు ఇప్పటి వరకు ఇంకనూ ప్రభుత్వ కార్యాలయాల వివరాలు సమర్పించని శాఖల అధికారులు, నిర్దేశిత నమూనా లో వివరాలు రెండు రోజుల్లోగా సమర్పించాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో జీరో పవర్ బిల్లుకు ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టిందని అన్నారు.వర్షాకాలం దృష్ట్యా పారిశుద్ధ్యం పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. లో లైన్ ప్రాంతాలు, పునరావాస కేంద్రాల వద్ద పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలన్నారు. వర్షాలకు నీరు నిలిచిన ప్రాంతాల్లో యాంటీ లార్వా పిచికారీ, ఆయిల్ బాల్స్, గంబుషియా చేపలు వదలడం చేయాలన్నారు. త్రాగునీటి వనరుల్లో ట్యా%శీ%కుల శుభ్రం, క్లోరినేషన్ చేపట్టాలన్నారు.

ప్రభుత్వం ఇందిరా గిరి జల వికాస పథకాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. ఈ పథకం క్రింద పోడు పట్టా ఉన్న ప్రతి రైతు పొలంలో సోలార్ పంప్ సెట్ల ద్వారా మోటార్ ఏర్పాటు కు చర్యలు చేపట్టనుందని కలెక్టర్ అన్నారు. జిల్లాలో 11 వేల 786 మంది లబ్ధిదారులకు చెందిన 27 వేల 447 ఎకరాల్లో ఈ పథక లబ్ది చేకూరుతుందన్నారు. గ్రౌండ్ వాటర్ శాఖ సమన్వయం తో ఎక్కడ నీటి లభ్యతకు ఉందో గుర్తించి, రాబోయే 3 సంవత్సరాల్లో లబ్ధిదారులందరికి పథక లబ్ది చేకూరేలా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో అన్ని గిరిజన సంక్షేమ వసతి గృహాల్లో టాయిలెట్స్, త్రాగునీటి వసతికి యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలన్నారు. నెల రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తి కావాలన్నారు. జల్ జీవన్ మిషన్ క్రింద జిల్లాలో గ్యాప్స్ పై వెంటనే చర్యలు తీసుకోవాలని అన్నారు. గ్రామ పంచాయతీ, మండల, జిల్లా స్థాయిలో లాగిన్ యాక్టివేట్ చేయాలి. జిల్లాలో ఎన్ని పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో విద్యుత్, త్రాగునీటి వసతి లేదో నివేదిక వెంటనే సమర్పించాలన్నారు. జిల్లాలో ఎన్ని హౌజ్ హోల్డ్స్ ఉన్నాయి, ఎన్ని వాటర్ కనెక్షన్లు ఉన్నవి నివేదిక ఇవ్వాలని, నీటి వసతి లేనిచోట ఇజిఎస్ ద్వారా నీటి వనరుల ఏర్పాటు కు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో ఖమ్మం నగరపాలక సంస్థ కమీషనర్ అభిషేక్ అగస్త్య, జెడ్పి సిఇఓ దీక్షా రైనా, డిఆర్డీవో సన్యాసయ్య, జిల్లా వైద్య ఆరోగ్య అధికారిణి డా. కళావతి బాయి, జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత, ట్రాన్స్కో ఎస్ఇ శ్రీనివాసాచారి, పీఆర్ ఎస్ఇ శేఖర్ రెడ్డి, హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు విజయలక్ష్మి, పబ్లిక్ హెల్త్ ఎస్ఇ రంజిత్, మునిసిపల్ ఇఇ కృష్ణలాల్, భద్రాచలం ఐటిడిఎ ఏపీవో డేవిడ్, ఎంపిడివో లు, మునిసిపల్ కమీషనర్లు, ఎంపీవో లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# జంతు శాస్త్ర విభాగంలో అల్లాడి ప్రసన్నతకు డాక్టరేట్



**సి కె న్యూస్ ప్రతినిధి:** కల్వకుర్తి గ్రామానికి చెందిన అల్లాడి ప్రసన్నత జంతుశాస్త్ర విభాగంలో డాక్టరేట్ పొందారు రాష్ట్రంలోని ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఆమె జంతు శాస్త్ర విభాగంలో డాక్టర్ అందుకున్నారు డాక్టర్ ప్రసన్నత ఉరుకొండ పేటలో పాఠశాల విద్యాభ్యాసం చేశారు కల్వకుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ,జడ్చర్ల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కాలేజీలో బిఎస్సి బి జెడ్ సి లో డిగ్రీ పూర్తి చేశారు .అనంతరం ఉస్మానియా యూనివర్సిటీలో ఎంఎస్సీ జువాలజీ పూర్తి చేసిన ప్రసన్నత అదే యూనివర్సిటీలో పిహెచ్డి ప్రవేశం పొందారు. జుప్లాంక్ టానిక్ డైవర్సిటీ అండ్ ఫిజికో కెమికల్ క్వాలిటీస్ ఆఫ్ డిండి రిజర్వాయర్ పై పరిశోధన చేసినందుకు గాను ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టర్ పట్టాను ఇచ్చి సత్కరించారు. ఈ సందర్భంగా ప్రసన్నతకు కుటుంబీకులు బంధుమిత్రులు శు భాకాంక్షలు తెలిపారు

# ఫోటో గ్రాఫర్ల సేవలు వెలకట్టలేనివి...

- వనపర్తి జిల్లా బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అక్కి శ్రీనివాస్ గౌడ్



**పెబ్బేరు ఆగస్టు19 (సి కే న్యూస్)**సమాజంలో ఫోటో గ్రాఫర్ల సేవలు వెలకట్టలేనివని వనపర్తి జిల్లా బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అక్కి శ్రీనివాస్ గౌడ్ అన్నారు.మంగళవారం అంతర్జాతీయ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భగా వనపర్తి జిల్లా పెబ్బేరు మున్సిపాలిటీలోని సుభాష్ చౌరస్తాలో సీనియర్ ఫోటో గ్రాఫర్లను ఘనంగా సన్మానించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ...కరోనా సమయంలో వారి సేవలను మాటల్లో వర్ణించలేనని తెలిపారు. క్రిమినల్స్‌ను పట్టుకోవడంలోనూ...ఫోటోగ్రాఫర్లు తీసిన ఫోటో తోటే సాధ్యమన్నారు.ఈ కార్యక్రమంలో భాను ప్రకాష్ రెడ్డి,మాలపల్లె మాజీ సర్పంచ్ సురేందర్ గౌడ్, ఫోటోగ్రాఫర్ల సంఘం అధ్యక్షులు అజంత వెంకటన్న సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# దళిత జర్నలిస్టు కు బెదిరింపులు దళితులు అంటే చులకలన, ఖబర్దార్

**మండల దళిత సంఘాలు**

**ఆగష్టు 19 ( సీ కే న్యూస్) చేగుంట:**నిజాలను నిర్భయంగా రాసినందుక దళిత జర్నలిస్ట్ పై దుర్భాషలాడుతున్న, శ్రీధర్ గుప్తాను వెంటనే వారిని అరెస్టు చేయాలని బీఎస్పీ చేగుంట మండల అధ్యక్షులు టప్ప భానుచందర్ డిమాండ్ చేశారు.ఈ చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. నిజాలను నిర్లయంగా రాస్తున్న దళిత జర్నలిస్ట్ అయినటువంటి నవతెలంగాణ రిపోర్టర్ పై బెదిరింపులకు పాల్పడుతున్న రైస్ మిల్లర్ యజమాని శ్రీధర్ గుప్తా పై అట్రాసిటీ కేసు నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేయాలనీ భానుచందర్ డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యానికి ఫోర్త్ఎస్టేట్ అయిన పత్రిక విలేకరులను బెదిరించడం అసాంఘిక చర్యలకు పాల్పడడం క్షమించరాని నేరమని దళిత జర్నలిస్ట్ అయినందువల్ల ఎటువంటి బెదిరింపులకు పాల్పడడం జరిగిందని ఆరోపించారు. ఇప్పటికైనా ఆయన అగ్రవర్ణ అహంకారాన్ని తగ్గించుకోకపోతే తగిన మూల్యం చెల్లించుకుంటారని ఆయన హెచ్చరించారు. ఎంతోమంది దళితుల బహుజనుల రక్తాన్ని పేరు చెప్పి చేసి కోట్లకు పడుగాఎత్తారని శ్రీధర్ గుప్తా మా బహుజనుల రాక్త మాంసాలు నీ శరీరమంతా ఉన్నాయని బహుజనులు కన్నెర చేస్తే తిరగలేరని ఈ సందర్భంగా హెచ్చరించారు. రానున్న రోజుల్లో ఇటువంటి ఘటనలు జరగకుండా మెదక్ జిల్లా ఎస్పీ తగ్గిన చర్యలు తీసుకోవాలని బాధితుడికి వెంటనే రక్షణ కల్పించి నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించాలన్నారు. మాకు చట్టాలపై న్యాయస్థానాలపై గౌరవం ఉందని ప్రభుత్వం వెంటనే ఈ ఘటనపై సీరియస్ గా తీసుకొని చర్యలు తీసుకోవాలని కోరారు. జర్నలిస్టుల కోసం ప్రత్యేక చట్టాలు చేయాలని ఈ సందర్భంగా టప్ప భానుచందర్ డిమాండ్ చేశారు. దళిత రిపోర్టర్ అయినందునే ఈ విధంగా దుర్భాషలాడుతూ చంపివేస్తానని బెదిరింపులకు గురి చేయడ అగ్రకుల అహంకారానికి నిదర్శనం అని శ్రీధర్ గుప్తా పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి తనకు న్యాయం జరిగేలా ప్రభుత్వము అతనిని వెంటనే అరెస్టు చేసి అతని నుండి తనకు ప్రాణ రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శ్రీధర్ గుప్తా అనే వ్యక్తి బహిరంగంగా చంపివేస్తానని బెదిరించిన ఇప్పటివరకు పోలీసులు నష్ట నివారణ చర్యలు ఎందుకు చేపట్టలేదని అతను ఏమైనా చట్టానికి అతీతుడా అని ప్రశ్నించారు. మాకు చట్టాలపై గౌరవం ఉందని వెంటనే చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో జిల్లాలో ఆందోళనలు చేపడతామని వారు హెచ్చరించారు.

# గతాన్ని మధురంగా మార్చే ఛాయాచిత్రం

-వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి



**సి కె న్యూస్ చౌటుప్పల్ మండల ప్రతినిధి ( శ్రీనివాస్) ఆగస్టు 19:**కెమెరా అనేక జ్ఞాపకాలను బంధించి అనేక అనుభూతులను పంచేదిగా నిలుస్తుందని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉప చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి తెలిపారు. చౌటుప్పల మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో, మండల ఫోటో అండ్ వీడియో గ్రాఫర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 186వ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ సందర్భంగా వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉప చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి పాల్గొని కెమెరా సృష్టికర్త లూయిస్ డాగురె ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి ద్విచక్ర వాహన ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా ఆకుల ఇంద్రసేన రెడ్డి మాట్లాడుతూ.. ఫోటో అనేది ఎల్లప్పుడూ గుర్తిండిపోయేది అలాంటి ఫోటో తీయడం ఫోటోగ్రాఫర్ గొప్పతనం అని తెలిపారు. ప్రతి ఫోటోగ్రాఫర్ కష్టపడి ముందుకు సాగాలని ఆయన ఫోటోగ్రాఫర్లను కోరారు. కార్యక్రమంలోజిల్లా సహాయ కార్యదర్శి గంగాపురం కాటమరాజు గౌడ్, మండల అధ్యక్షులు తూర్పునూరు సాయిలు గౌడ్, ప్రధాన కార్యదర్శి చుక్క స్వామి, సహాయ కార్యదర్శి రోషణ గారి రాఘవేంద్ర గౌడ్, సీనియర్ ఫోటోగ్రాఫర్లు చింతల గణేష్ మెట్టు రామచంద్రారెడ్డి, భారత మధు, కందగట్ల కృష్ణ, భీమనపల్లి బలరాం, నల్లంకి మహేష్ గౌడ్, రవి, కత్తుల రవి, వరి కుప్పల మహేష్, దోర్నాల వాసుదేవ్,వనం రాజేష్,పగిళ్ల మహేష్, నూనె నవీన్, శివ చారి, కృష్ణ, ప్రభాకర్,సంతోష్,నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.ు

# ప్రమాదకరంగా విద్యుత్

- పొంచి ఉన్న ప్రమాదం
- ఏదైనా జరుగుతే బాధ్యులు ఎవరు
- నివారణ చర్యలు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి



**ఆగష్టు 19 (సీ కే న్యూస్) చేగుంట**

చేగుంట మండలంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లు, ప్రమాదకరంగా మారాయి, చిన్న చిన్న సమస్యలు ఏర్పడినప్పుడు, వాటి నుంచి వచ్చే మీరుగులతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు, చందాయిపెట్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల 20 మీటర్ల దూరంలో కంచె లేకుండా 100 హెచ్ పి, రెండు ట్రాన్స్ఫుర్ ఏర్పాటు చేశారు. పాఠశాలకు వెళ్లే దారిలో చేతికందే ఎత్తులో కంచలేని విద్యుత్ ట్రాన్స్ఫారం ఏర్పాటు చేశారు, దీని పక్కనుంచే విద్యార్థులు పాఠశాల నుండి ఇంటికి, ఇంటి నుండి పాఠశాలకు వెళుతుంటారు, దాని చుట్టు కంచె ఏర్పాటు చేయాలని విద్యుత్ అధికారులు దృష్టికి, ఎన్ని సార్లు తీసుకెళ్లిన ఫలితం లేకుండా పోయిందని గ్రామస్తులు వాపోయారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి వెంటనే ప్రమాదం జరగకుండా అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# గణేష్ మండపాలకు అనుమతులు తప్పనిసరి

ఇల్లందు డీఎస్పీ చంద్రబాను



**సి కే న్యూస్ ఇల్లందు నియోజకవర్గ ప్రతినిధి (వెంకటేష్) ఆగస్టు 19,**

వినాయక చవితి సందర్భంగా ఇల్లెందు పట్టణంలో గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే గణేష్ మండపాలకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఇల్లెందు డీఎస్పీ చంద్రబాను అన్నారు. మంగళవారం ఇల్లెందు పట్టణంలో గణేష్ ఉత్సవ కమిటీ లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వినాయక చవితి సందర్భంగా విగ్రహాలు పెట్టేవారు పోలీస్ స్టేషన్లో ఖచ్చితంగా పర్మిషన్ తీసుకోవాలన్నారు. మండపాల వద్ద డీజేలు పెట్టకూడదని సూచించారు. రాత్రి వేళల్లో గుంపులుగా ఉండి ప్రజలను ఇబ్బందులకు గురిచేయొదన్నారు. విద్యుత్ వైర్ల కింద మండపాలు, విగ్రహాలు పెట్టకూడదన్నారు. విద్యుత్, అగ్నిమాపక శాఖల అనుమతులు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎస్ఐ హసీనా, సూర్య, సిబ్బంది పాల్గొన్నారు.

# కీలక ఖనిజాల అన్వేషణలో సింగరేణి "బంగారు" అడుగు.

వేలంలో కర్ణాటక దేవదుర్గ్ లోని బంగారం, రాగి గనుల అన్వేషణ లైసెన్స్ దక్కించుకున్న సింగరేణి

సింగరేణి చరిత్రలో తొలిసారిగా కీలక ఖనిజ రంగంలోకి ప్రవేశం.

భవిష్యత్ లో మైనింగ్ చేసే సమయంలో 37.75 శాతం రాయల్టీ పొందనున్న సంస్థ.

సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ వెల్లడి

రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క మల్లు అభినందనలు.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్), ఆగస్టు 19,** సింగరేణి సంస్థ కీలక ఖనిజరంగంలోకి ప్రవేశించాలన్న రాష్ట్ర ప్రభుత్వ సంకల్పం కార్యరూపం దాల్చింది. కర్ణాటకలోని దేవ దుర్గ్ లోని బంగారం, రాగి గనుల అన్వేషణ లైసెన్స్ కోసం కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని గనుల మంత్రిత్వ శాఖ నిర్వహించిన ఆన్లైన్ వేలంలో 37.75 శాతం రాయల్టీ ని కోట్ చేయడం ద్వారా సింగరేణి ఎల్-1 బిడ్డర్గా నిలిచినట్లు సంస్థ సీఎండీ ఎన్.బలరామ్ మంగళవారం తెలిపారు. తద్వారా కీలక ఖనిజాన్వేషణ లో సింగరేణి శుభారంభం చేసినట్లు అయిందన్నారు. సింగరేణిని ఇతర రంగాల్లోకి విస్తరించాలన్న రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా చేస్తున్న ప్రయత్నంలో తొలి విజయాన్ని సాధించినట్లు ఆయన పేర్కొన్నారు. రానున్న ఐదేళ్లలో ఈ గనుల్లో అన్వేషణను పూర్తి చేస్తామన్నారు.

**త్వరలోనే కర్ణాటకలో సింగరేణి అన్వేషణ....**

కర్ణాటక దేవదుర్గ్ లోని బంగారం, రాగి నిక్షేపాలు ఉన్న ఈ ప్రాంతంలో సింగరేణి అన్వేషణ విభాగం ఆధ్వర్యంలో త్వరలో పరిశోధన చేయనుంది. వివిధ రకాల అన్వేషణల అనంతరం తుది ఫలితాలను కేంద్ర ప్రభుత్వానికి నివేదిక రూపంలో సమర్పించాల్సి ఉంటుంది. అనంతరం కేంద్రం ఈ గనులను మైనింగ్ కోసం వేలంలో వేస్తుంది. ఆ గనులను సింగరేణి లేదా ఇతర సంస్థలు దక్కించుకోవడానికి అవకాశం ఉంటుంది. ఈ గనులను మైనింగ్ కోసం దక్కించుకున్న సంస్థలు రాష్ట్ర ప్రభుత్వానికి చెల్లించాల్సిన రాయల్టీలో 37.75 శాతాన్ని ఆ గని జీవిత కాలం పాటు సింగరేణికి చెల్లించాల్సి ఉంటుంది. ఈ అన్వేషణ కోసం సుమారు 90 కోట్ల రూపాయలు వ్యయం అవుతుండగా.. అందులో రూ.20 కోట్లను కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ గా చెల్లిస్తుంది.

రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి అభినందనలు బొగ్గు మైనింగ్ లో 136 ఏళ్ల సుదీర్ఘ అనుభవం ఉన్న సింగరేణి సంస్థ తొలిసారిగా బంగారం, రాగి గనుల అన్వేషణ లైసెన్సును వేలం ద్వారా దక్కించుకోవడం పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు తమ హర్షం ప్రకటించారు. సింగరేణి సంస్థ తనకున్న అపారమైన అన్వేషణ అనుభవం, బొగ్గు తవ్వకం అనుభవంతో కీలక ఖనిజాల అన్వేషణలోనూ దేశంలో ఒక అగ్రగామి సంస్థగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో సింగరేణి అంతర్జాతీయ సంస్థగా నిలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఇదే స్ఫూర్తితో ముందుకు వెళ్లాలని సంస్థ సీఎండీ ఎన్.బలరామ్కు, ఉద్యోగులందరికీ అభినందనలు తెలియజేశారు.

**మూడు గనుల వేలంలో పాల్గొన్న సింగరేణి...**

కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది మార్చి 13వ తేదీన మొత్తం 13 కీలక ఖనిజాల అన్వేషణ లైసెన్స్ ల కోసం వేలం ప్రక్రియను ప్రారంభించింది. ఇందులో సింగరేణి సంస్థ పాలుపంచుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం సూచించింది. ఈ నేపథ్యంలో అన్వేషణకు అనువైన బ్లాక్లపై సింగరేణి నిపుణుల బృందాన్ని ఏర్పాటు చేసి అధ్యయనం చేయడం జరిగింది. అనంతరం మధ్య ప్రదేశ్ లోని పదార్ లోని ప్లాటినమ్ గ్రూప్ ఎలిమెంట్స్ బ్లాక్, ఆంధ్రప్రదేశ్ లోని చంద్రగిరి వద్ద ఉన్న ఒంటిల్లులోని రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ బ్లాక్, కర్ణాటకలోని బంగారం, రాగి బ్లాక్లు తమకు అనువైనవని గుర్తించడం జరిగింది. వీటి కోసం ఈ నెల 13, 14, 19 తేదీల్లో కేంద్ర ప్రభుత్వం ఆన్లైన్ వేలం నిర్వహించింది. ఇందులో ఈ నెల 19వ తేదీన జరిగిన వేలంలో కర్ణాటకలోని దేవదుర్గ్లోని బంగారం, రాగి బ్లాక్ల అన్వేషణ లైసెన్సును సింగరేణి దక్కించుకోవడం విశేషం.

# సిపిఐ తెలంగాణ రాష్ట్ర4 వ మహాసభలను జయప్రదం చేయండి

సిపిఐ జిల్లా నాయకులు గుగులోతు రామ్ చందర్.



**సి కే న్యూస్ ఇల్లందు నియోజకవర్గ ప్రతినిధి (వెంకటేష్) ఆగస్టు 19,**

టేకులపల్లి మండలం భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ తెలంగాణ రాష్ట్ర 4 వ మహాసభలు ఈనెల 20, 21, 22 తేది లలో మూడు రోజులు మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా గాజుల రామవరం లో జరగనున్నాయని. ఈ మహాసభల జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా నాయకులు గుగులోతు రామ్ చందర్ కోరారు. సిపిఐ పార్టీ 1925 డిసెంబర్ 26వ తేదీన కాన్పూర్ లో ఆవిర్భవించిన వందేళ్లు కాలంలో చేసిన పోరాటాలు. త్యాగాలు. వేల కట్టలేని వన్నారు. దేశ స్వసంత్ర పోరాటంలో అనేకమంది కమ్యూనిస్టు నాయకులు కుట్ర కేసులను ఎదుర్కొని జైళ్లలో నిర్బంధించబడ్డారని. ప్రాణ త్యాగాలు చేశారన్నారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా దున్నేవాడికి భూమికోసం సామాజిక న్యాయం కోసం జరిగిన తెలంగాణ సాయుధ పోరాటంలో నాలుగున్నర వేల మంది కమ్యూనిస్టులు అమరు లై నరన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో సిపిఐ మహోజ్వల పాత్ర నిర్వహించిందన్నారు. కార్మిక. కర్షక. యువజన. విద్యార్థి. మహిళా శ్రమజీవుల సమస్యలపై నిరంతరం పోరాడుతుందని. వృత్తి సంఘాలను నిర్మాణం చేసి వారి హక్కుల కోసం నిరంతరం కమ్యూనిస్టు పార్టీ పోరాట ఫలితంగా వందేళ్ళ చరిత్రను ఈ నాలుగవ రాష్ట్ర మహాసభలో జాతీయ రాష్ట్రానికి సంబంధించిన నాయకులు పాల్గొంటారని రామ్ చందర్ తెలిపారు

# ఈ నెలాఖరులోగా అన్ని సంక్షేమ హాస్టళ్లలో శత శాతం ప్రవేశాలు పూర్తి చెయ్యాలి.

- జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్

**అనకాపల్లి సి కే న్యూస్** జిల్లాలోని అన్ని సంక్షేమ వసతి గృహాలు మరియు పాఠశాలలు, కళాశాలల్లో ఈ నెల 31 నాటికి శత శాతం ప్రవేశాలు పూర్తి చెయ్యాలని , మరియు అన్ని వసతి గృహాల్లో ప్రతి రోజు పక్కాగా మెనూ అమలు చెయ్యాలని కలెక్టర్ విజయ కృష్ణన్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లాలో అన్ని సంక్షేమ శాఖల జిల్లా అధికారులతో కలిసి వసతి గృహ సంక్షేమ అధికారులతో ప్రీమెట్రిక్, పోస్ట్ మెట్రిక్ వసతి గృహములు, మరియు రెసిడెన్షియల్, కె జి బి వి పాఠశాలలో ప్రవేశల పై వీడియో కన్ఫరన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలలు, కాలేజీ, మోడల్ కాలేజీ, మహాత్మా జ్యోతిరావ్ పూలె వెనుకబడిన తరగతుల సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాల, కస్తూరిభా గాంధి బాలికల విద్యాలయాలు, మోడల్ స్కూల్లో ఈ నెల 31 లోపు శత శాతం సీట్ల భర్తీ మరియు పక్కాగా మెనూ అమలు చెయ్యాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులు గంజాయి, మత్తు పదార్ధాలకు బానిస కాకుండా చూడాల్సిన బాధ్యత సంక్షేమ వసతి గృహల అధికారులదేనన్నారు.

ఈ సమావేశంలో జిల్లా వెనుకబడిన తరగతుల, సాంఘిక, గిరిజన సంక్షేమ అధికారులు కె. శ్రీదేవి, రామనందం, మంగవేణి, సాంఘిక, గిరిజన, వెనుకబడిన తరగతుల రెసిడెన్షియల్ పాఠశాలల కో- ఆర్డినేటర్లు, వీడియో కాన్ఫిరెన్స్ ద్వారా మోడల్ స్కూల్, కె.జి.బి.వి. ల ప్రిన్సిపాల్స్, వసతిగృహ సంక్షేమ వసతి గృహ అధికారులు పాల్గొన్నారు.




# ఒడిశా నుంచి తమిళనాడుకు అక్రమంగా తరలిస్తున్న భారీ గంజాయి స్వాధీనం.

**నర్సీపట్నం, సి కే న్యూస్** అక్రమంగా రవాణా చేస్తున్న 75లక్షల రూపాయలు విలువచేసే 216 కిలోల గంజాయితో పాటు మూడు వాహనాలను పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. నర్సీపట్నం డిఎస్పి పి.శ్రీనివాసరావు, నర్సీపట్నం రూరల్ పోలీస్ స్టేషన్లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈగిల్ డిస్ట్రిక్ట్ స్పెషల్ బ్రాంచ్, జిల్లా ఎస్పి తుహిన్ సిన్హా సమాచారం మేరకు నర్సీపట్నం రూరల్ సీఐ రేవతమ్మ, గొలుగొండ ఎస్సై రామరావు, నర్సీపట్నం రూరల్ ఎస్సై పి.రాజారావు తమ సిబ్బందితో గొలుగొండ మండలం కొమిర గ్రామ ప్రాంతం వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్నారని ఆ సమయంలో వచ్చిన టిఎస్ 18 బిఎం 3838, ఏపీ 31 సియం 2708 , ఏపీ 40 ఎఫ్ ఆర్ 8799 నెంబర్ కలిగిన వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయగా7 బస్తాల్లో అక్రమంగా తరలిస్తున్న 216 కేజీలు గంజాయిని గుర్తించి నిందితులను అదుపులోకి తీసుకున్నామని, మరి కొందరు వ్యక్తులు పరారీలో ఉన్నారని వీరిని కూడా పట్టుకుంటామని తెలిపారు.

పట్టుబడిన గంజాయి విలువ సుమారు 54 లక్షలు రూపాయల వరకు ఉంటుందన్నారు పట్టుబడిన వాహనాలతో 75 లక్షల రూపాయల వరకు విలువ ఉంటుందన్నారు. ఒడిశా రాష్ట్రం చిత్రకొండ లో కొనుగోలు చేసి తమిళనాడుకు అక్రమంగా గంజాయిని తరలిస్తున్నారని పేర్కొన్నారు. గంజాయిని తరలిస్తున్న నిందితులు తమిళనాడుకు చెందిన తరుణ్ కుమార్ గోపి, అల్లూరి సీతారామ జిల్లా దోమలగొంది గ్రామం చింతపల్లి మండలానికి చెందిన గడుగు కొండబాబు, చిత్తూరు జిల్లా సత్యవేడుకు చెందిన ఎ.దినేష్, వీరుపై కేసు నమోదు చేసి ముద్దాయిలను కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు డి.ఎస్.పి శ్రీనివాసరావు, తెలిపారు. గంజాయి పట్టుకోవడంలో చకచక్కంగా వ్యవహరించిన సిబ్బందికి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు.

CK NEWS చంద్రకాంత్ తెలుగు దినపత్రిక

## భారత్ పై సుంకాల విషయంలో ట్రంప్ హింట్.. ఏమిటీ గంతులు? ఇలా రష్యా నుంచి చమురు

అలాస్కా వేదికగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు పుతిన్ మధ్య ఉక్రెయిన్ యుద్ధం ముగించే విషయంపై చర్చలు జరిగిన సంగతి తెలిసిందే. ఈ భేటీ వల్ల ప్రయోజనం ఏమీ కలగనప్పటికీ.. ఈ భేటీకి ముందు, తర్వాత భారత్ పై అదనపు సుంకాల విషయంలో ట్రంప్ చేసిన వ్యాఖ్యలు మాత్రం చర్చనీయాంశంగా మారాయి. రష్యాతో భేటీ వేళ చేయడంతో ఈ వ్యాఖ్యలపై సందేహాలూ వినిపిస్తున్నాయి!అవును... రష్యా నుంచి ముడి చమురు కొనుగోలు చేస్తున్న దేశాలపై అదనంగా సెకండరీ టారిఫ్ లను విధిస్తున్నట్లు ప్రధానంగా భారత్ ను దృష్టిలో పెట్టుకుని ట్రంప్ ఇటీవల వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే! అయితే తాజాగా... తాము ఆ సెకండరీ టారిఫ్ లను విధించకపోవచ్చని ట్రంప్ సంకేతాలిచ్చారు. పుతిన్ తో కీలక భేటీ ముగిసిన అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.దులో భాగంగా... ఈ రోజు జరిగిన పరిణామాల తర్వాత.. రష్యా చమురు కొనుగోలు చేస్తున్న దేశాలపై అదనపు సుంకాల గురించి రెండు, మూడు వారాల్లో పునరాలోచన చేస్తాం అని ట్రంప్ వెల్లడించారు. పుతిన్ తో భేటీకి ముందు కూడా ట్రంప్ దీనిపై స్పందిస్తూ... రష్యా తన చమురు క్లయింట్ ను కోల్పోయిందని (భారత్ ను ఉద్దేశించి) వ్యాఖ్యానించారు.


అయితే.. గత కొనుగోళ్లు సుమారు 40 శాతం ఉన్నాయని ఆయన వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలోనే... ప్రస్తుతానికి భారత్, చైనా లాంటి దేశాలపై అదనపు టారిఫ్ లు విధించే ఉద్దేశం లేదని అన్నారు. కాగా... భారత్ పై ఇటీవల 25% అదనపు సుంకాలు విధిస్తున్నట్లు ట్రంప్ వెల్లడించిన సంగతి తెలిసిందే. ఈ కొత్త టారిఫ్ లు ఆగస్టు 27 నుంచి అమల్లోకి రానున్నాయి.

దీంతో... అగ్రరాజ్యాధిపతి అయిన ట్రంప్ ఇలా తన అవసరాలకు తగ్గట్లుగా, పరిస్థితులను మేనేజ్ చేసేందుకు ఏమార్చే విధంగా... ఇలా పూటకో మాట, రోజుకో నిర్ణయం తీసుకోవడం సరైంది కాదని.. ఆయన వ్యాఖ్యలు, నిర్ణయాలు హుందాగా, శిలాసాసనంలా ఉండాలని.. అలా కాకుండా ఇలా కప్ప గంతుల్లా ఉండటం ఏమిటని పలువురు ప్రశ్నిస్తుండటం గమనార్హం.

**వెనక్కి తగ్గని భారత్!:**

ఇలా రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకుంటుందన్న కారణంతో భారత్ పై డొనాల్డ్ ట్రంప్ ఇటీవల సుంకాలను పెంచిన సంగతి తెలిసిందే. అయితే.. ఈ పరిణామంతో భారత్ వెనక్కు తగ్గి.. మాస్కో నుంచి చమురు కొనుగోళ్లను నిలిపేయడం లాంటిదేమీ చేయలేదని 'ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్' ఛైర్మన్ ఏఎస్ సాహ్నీ తెలిపారు. అమెరికా సుంకాలకు ప్రతిస్పందనగా.. కొనుగోళ్లను తగ్గించాలని, లేదా పెంచాలని తమకు ఎటువంటి సూచనలూ అందలేదని అన్నారు.

# ప్రొటీన్ ఎక్కువ తీసుకుంటున్నారా..? అయితే ఈ సమస్యలు వస్తాయి.. జాగ్రత్త..!




మానవుని శరీరానికి ప్రోటీన్లు చాలా అవసరం. వీక్ గా ఉన్నప్పుడు కానీ.. ఏవైనా ఆరోగ్య సమస్యలు ఉన్నప్పుడు గానీ డాక్టర్లు ప్రోటీన్లు ఉండే పదార్థాలు వాడాలని సూచిస్తారు. శరీరానికి అవసరమైన సూక్ష్మపోషకాల్లో ప్రోటీన్ ఒకటి. ప్రోటీన్ అమైనో ఆమ్లాలుగా విచ్ఛిన్నం కావడం వల్ల శరీరంలో కండరాల పెరుగుదలకు సహాయపడుతుంది. దీనితో పాటుగా ఇది హార్మోన్లను నియంత్రిస్తుంది. అలాగే న్యూరోట్రాన్స్మిటర్లు, రోగనిరోధక పనితీరుకు కూడా చాలా అవసరమవుతుంది. అయితే ప్రోటీన్లు ఎక్కువగా వాడటం వల్ల ఎలాంటి అనారోగ్య సమస్యలు వస్తాయో తెలుసుకుందాం. ముఖ్యంగా ప్రోటీన్లు ఎక్కువగా కలిగిన ఆహారం తింటే బరువు తగ్గొచ్చని డాక్టర్లు చెబుతుంటారు. కానీ అలాంటి ఆహారం తిన్నప్పుడు స్వల్పంగా అయితే బరువు తగ్గుతారు.. కానీ భవిష్యత్ లో మళ్లీ బరువు పెరగడానికి ఆస్కారం ఉంటుంది. ఎందుకంటే శరీరంలో కొవ్వువలే ఎక్కువ ప్రోటీన్ నిల్వ ఉండటంతో.. అమైనో ఆమ్లాల పరిణామం పెరుగుతుంది. దీంతో మళ్లీ బరువు పెరిగేందుకు ఛాన్స్ ఉందంటున్నారు ఆరోగ్య నిపుణులు. జంతువులతో వచ్చే ప్రోటీన్ తీసుకుంటూ, ఆహారంలో పండ్లు, కూరగాయలు వంటి ఫైబర్ ఎక్కువగా ఉండే మొక్కల ఆహారాన్ని తీసుకోకపోతే.. మీకు మలబద్ధకం సమస్య వచ్చే అవకాశం ఉంది. అలాగే ఉబ్బరం వంటి ఇతర జీర్ణ సమస్యలు కూడా వస్తాయి. అంతేకాకుండా ప్రోటీన్లు అధికంగా తీసుకోవడం వల్ల నోటి నుంచి దుర్వాసన వస్తుంది. ముఖ్యంగా కార్బోహైడ్రేట్లను బాగా తగ్గించినప్పుడు వాసన మరింత ఎక్కువవుతుంది. ఫైబర్ లేని పాలు, ప్రాసెస్ చేసిన ఆహారాన్ని ఎక్కువ మొత్తంలో తీసుకుంటుంటే మీకు విరేచనాల సమస్య వచ్చే అవకాశం ఉంది.

అయితే ఒక వ్యక్తి వారి వయస్సు, లింగం, శరీర బరువు, శరీర కూర్పు, శారీరక శ్రమపై ఆధారపడి ఉంటుంది. ఒక వ్యక్తి శారీరక శ్రమలో పాల్గొనకపోతే.. వారు వారి శరీర బరువులో కిలోగ్రాముకు కనీసం 0.8 గ్రాముల ప్రోటీన్ ను క్రమం తప్పకుండా తీసుకోవాలి. మీరు రోజులో 1 గంట పాటు వ్యాయామాలు చేస్తే మీ శరీరంలోని 3 కిలోలకు 1.2 నుంచి 1.7 గ్రాముల ప్రోటీన్ ను తీసుకోవాలంటూ ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.



# తిండి విషయంలో ఈ తప్పులు చేయొద్దు!

### మానవాళి ఆరోగ్యంపై తిండి అలవాట్ల ప్రభావం

### ఆహారపు అలవాట్లు ఆరోగ్యాన్ని నిర్దేశిస్తాయంటున్న పరిశోధకులు

### మధ్యాహ్న భోజన విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచన

మానవుల ఆరోగ్యాన్ని ప్రభావితం చేసే అనేక అంశాలలో తిండి అలవాట్లు కూడా ముఖ్యమైనవే. ఆహారపు అలవాట్లు వ్యక్తుల ఆరోగ్యాన్ని నిర్దేశిస్తాయని పరిశోధకులు అంటున్నారు. తిండి విషయంలో చేసే కొన్ని తప్పులు చిన్నవే అయినా దీర్ఘకాలంలో చేటు చేస్తాయని, ప్రమాదకర జబ్బులకు దారితీస్తాయని చెబుతున్నారు. ఆహారం విషయంలో కొన్ని అలవాట్లకు దూరంగా ఉండాలని, ముఖ్యంగా మధ్యాహ్న భోజనం విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు.

అవేంటో చూద్దాం...

ఉదయం అల్పాహారం తినకుండా మధ్యాహ్న భోజనం పీకల దాకా లాగించడం

తిన్నవెంటనే పనిచేయడం

మంచినీరు తక్కువగా తీసుకోవడం

పిచ్చిపట్టినట్టుగా తినడం

నిర్దిష్ట సమయం అంటూ లేకుండా ఎప్పుడంటే అప్పుడు లంచ్ చేయడం.

మధ్యాహ్న భోజన సమయంలో కనీసం స్నాక్స్ అయినా తీసుకోకపోవడం

లంచ్ లో ఎప్పుడూ జంక్, ప్రాసెస్డ్ ఫుడ్ తినడం

మధ్యాహ్నం భోజనం చేయాల్సిన సమయంలో టీ, కాఫీలు తాగడం

హడావిడిగా తినడం

పోషక విలువలున్న ఆహారానికి లంచ్ లో చోటివ్వకపోవడం

లంచ్ కు ఓ ప్రణాళిక అంటూ లేకపోవడం

మధ్యాహ్న భోజనంలో సమతుల ఆహారం తీసుకోకపోవడం

ఈ అలవాట్లన్నీ అప్పటికప్పుడేమీ ప్రభావం చూపవు, కానీ నిదానంగా ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయి మొదట్లో వీటి లక్షణాలు ఓ మోస్తరుగానే అనిపించినా, కాలక్రమంలో కోలుకోలేనంతగా నష్టం వాటిల్లుతుంది.

సరైన రీతిలో మధ్యాహ్న భోజనం చేయకపోతే శరీరం తగినంత మోతాదులో కీలక విటమిన్లను, ఖనిజలవణాలను స్వీకరించలేదు. అస్తవ్యస్త భోజన సమయాలు మొదట జీర్ణవ్యవస్థను నాశనం చేస్తాయి. దాంతో ఉదరంలో జీర్ణరసాల ఉత్పత్తిలో సమతుల్యత ఉండదు. మొదట్లో చిన్న సమస్యలే అనుకున్నవి ఆ తర్వాత తీవ్రస్థాయికి చేరతాయి.

ప్రధానంగా, సక్రమమైన తిండి అలవాట్లు లేకపోతే మధుమేహం బారినపడే ముప్పు ఎక్కువ. సరైన సమయంలో ఆహారం తీసుకోకపోవడం, మధ్యాహ్న భోజనం వరకు పరగడుపునే ఉండడం శరీరంలో ఇన్సులిన్ స్థాయిలను కుదుపులకు గురిచేస్తాయి. దాంతో బ్లడ్ సుగర్ హెచ్చుతగ్గులకు లోనవుతుంది.

ఇక, కొన్ని రకాల ఆహార పదార్థాలు క్యాన్సర్ కు దారితీస్తాయి. ఒబేసిటీతో పాటు 13 రకాల క్యాన్సర్లకు అనారోగ్యకర ఆహారమే కారణమని పరిశోధకులు గుర్తించారు. మెనింజియోమా, థైరాయిడ్, అడెనోకార్సినోమా, ఈసోఫేగస్, మల్టీపుల్ మైలోమా, కిడ్నీ, యూట్రస్, ఓవరీ, లివర్, గాల్ బ్లాడర్, ఉదరం, ప్యాంక్రియాస్, బ్రెస్ట్ క్యాన్సర్ లకు అనారోగ్యకరమైన తిండికి సంబంధం ఉందని అనేక అధ్యయనాలు చెబుతున్నాయి.

మధ్యాహ్న భోజనంలో బలమైన పోషకాహారం తీసుకోకపోతే గుండె బలహీనపడుతుంది. అదే సమయంలో గుండె ఆరోగ్యంగా ఉండాలంటే ఉప్పు మోతాదు మించరాదు. ప్రతిరోజు పెద్దవాళ్లు 2,300 ఎంజీ కంటే ఎక్కువ ఉప్పు తీసుకోరాదు. అయితే ప్రస్తుతకాలంలో ప్యాకేజ్డ్ ఫుడ్స్ రూపంలో మనకు తెలియకుండానే ఉప్పు అధికంగా తీసుకుంటున్నాం. ఆరోగ్యకరమైన ఆహారానికే ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా సోడియం వినియోగాన్ని నియంత్రించవచ్చు.

# వాటిని కాదన్నందుకు హృతిక్ ఆవేదన



బాలీవుడ్ సూపర్ స్టార్ హృతిక్ రోషన్ హీరోగా నటించిన వార్ 2 సినిమా విడుదలకు సిద్ధంగా ఉంది. ఈనెల 14న ప్రపంచవ్యాప్తంగా భారీగా విడుదల కాబోతుంది. ఎన్టీఆర్ కీలక పాత్రలో నటించిన కారణంగా తెలుగు రాష్ట్రాల్లో భారీ ఎత్తున విడుదల చేయబోతున్నారు. వార్ 2 సినిమా ట్రైలర్‌కి పాజిటివ్ రెస్పాన్స్ రావడంతో మేకర్స్ అదే పాజిటివ్ బజ్ కంటిన్యూ అయ్యే విధంగా ప్రమోషన్స్ చేస్తున్నారు. వార్ 2 సినిమా ప్రమోషన్‌లో భాగంగా హృతిక్ రోషన్ ఇటీవల ఒక చిట్ చాట్‌లో పలు ఆసక్తికర విషయాలను వెల్లడించాడు. ముఖ్యంగా కెరీర్ ఆరంభం నుంచి హృతిక్ వదులుకున్న కొన్ని ప్రాజెక్ట్‌ల గురించి చెప్పుకొచ్చాడు. ఆ ప్రాజెక్ట్‌ల గురించి ప్రస్తుతం సోషల్ మీడియాలో తెగ చర్చ జరుగుతోంది.

అమీర్ ఖాన్ దిల్ చహ్తే హై

హృతిక్ రోషన్ కెరీర్ ఆరంభంలో 'దిల్ చహ్తే హై' చేయాల్సి ఉంది. ఫర్హాన్ అక్తర్ దర్శకత్వంలో 2001లో ఆ సినిమా ఛాన్స్ హృతిక్ రోషన్ వద్దకు మొదట వచ్చిందట. కొన్ని కారణాల వల్ల ఆ సినిమాను హృతిక్ చేయలేక పోయాడు. అదే సమయంలో మంచి జోష్ లో ఉన్న అమీర్ ఖాన్ ఆ సినిమాను చేశాడు. అమీర్ ఖాన్ చేసిన దిల్ చహ్తే హై సినిమా మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. ఆ సినిమాను వదిలేసినందుకు ఖచ్చితంగా హృతిక్ రోషన్ ఫీల్ అవుతూ ఉంటాడని అంతా అనుకుంటూ ఉంటారు. తాజాగా అదే విషయాన్ని గురించి హృతిక్ రోషన్ మాట్లాడుతూ ఆ సినిమాను చేయలేకపోయినందుకు ఖచ్చితంగా బాధగా ఉందని, ఒక మంచి సినిమా మిస్ అయినందుకు చింతించకుండా ఎలా ఉంటామని అన్నాడు.

**3 ఇడియట్స్ హృతిక్ రోషన్ చేయాల్సింది**

దిల్ చహ్తే హై సినిమా తర్వాత రాజ్ కుమార్ హిరానీ దర్శకత్వంలో చేయాల్సిన '3 ఇడియట్స్' సినిమాను సైతం వదిలేసినట్లు హృతిక్ రోషన్ చెప్పుకొచ్చాడు. ఆ సినిమా కథ విషయంలో చర్చలు జరుగుతున్న సమయంలోనే కొన్ని కారణాల వల్ల తప్పుకున్నట్లు హృతిక్ చెప్పుకొచ్చాడు. ఆ సినిమాను ఆమీర్ ఖాన్ చేయడం, భారీ విజయాన్ని సొంతం చేసుకోవడం తెలిసిందే. 3 ఇడియట్స్ కమర్షియల్‌గా భారీ విజయాన్ని సొంతం చేసుకోవడం మాత్రమే కాకుండా ఒక గొప్ప సినిమాగా ఇండియన్ సినీ చరిత్రలో నిలిచిపోయింది. అలాంటి సినిమాను మిస్ అయినందుకు ఖచ్చితంగా చింతిస్తున్నాను అంటూ హృతిక్ రోషన్ తన ఆవేదన వ్యక్తం చేశాడు. మంచి కథలు, మంచి సినిమాలు అప్పుడప్పుడు మిస్ కావడం అందరికీ సహజమే.

**వార్ 2 బాక్సాఫీస్ ను షేక్ చేయడం ఖాయం**

ఆ రెండు సినిమాలను మిస్ చేసుకున్నందుకు చింతిస్తున్నాను అంటూనే ఆ రెండు సినిమాలు అమీర్ ఖాన్ వంటి మంచి నటుడు చేయడం వల్ల లాభం పొందాయి అని నేను భావిస్తున్నాను అన్నాడు. గొప్ప సినిమాలకు మంచి నటులు అవసరం. ఆ కథలు అమీర్ ఖాన్ కి మరింతగా సెట్ అయ్యాయి అనిపిస్తుందని హృతిక్ రోషన్ చెప్పుకొచ్చాడు. ఆ సినిమాలు నేను చేసి ఉంటే బాగుండేది అని అనుకోవడం తో పాటు అమీర్ ఖాన్ ఆ సినిమాలు చేయడం వల్ల మంచి ఫలితం దక్కింది అనేది ఆయన మాట. వార్ సినిమాతో భారీ విజయాన్ని సొంతం చేసుకున్న హృతిక్ రోషన్ ఈ సినిమాతో అంతకు మించిన బ్లాక్ బస్టర్ విజయాన్ని సొంతం చేసుకుంటాను అనే నమ్మకం వ్యక్తం చేస్తున్నారు. హృతిక్, ఎన్టీఆర్ ఫ్యాన్స్ ఈ సినిమా ఖచ్చితంగా రూ.1000 కోట్ల సినిమా అంటున్నారు. మరి ఈ స్పై థ్రిల్లర్ ఏ మేరకు హిట్ అయ్యేనో చూడాలి.



ఐశ్వర్య రాజేష్ తాజా ఫోటోలో జీవితంలోని సాధారణ క్షణాలను స్వీకరించింది





## తెలుగు మూవీలో అలియా.. స్టోరీ వెనుక ఇంట్రెస్టింగ్ కథ!

బాలీవుడ్ బ్యూటీ అలియా భట్ తెలుగు సినీ ప్రియులకు కూడా సుపరిచితురాలే. బీ టౌన్ లో స్టార్ హీరోయిన్ గా కొంతకాలంగా దూసుకుపోతున్న ముద్దుగుమ్మ సౌత్ సినిమాల్లో నటించడానికి ఎప్పుడూ రెడీగా ఉంటుందనే చెప్పాలి. ఇప్పటికే తెలుగులో ఆర్ఆర్ఆర్ మూవీతో సందడి చేసిన విషయం తెలిసిందే. ఎస్ ఎస్ రాజమౌళి దర్శకత్వం వహించిన ఆ సినిమాలో తన యాక్టింగ్ తో సీతగా మెప్పించింది. మూవీలో ఆలియా కనిపించేది కొద్దిసేపే అయినా ఆడియన్స్ ను ఫిదా చేసిందనే చెప్పాలి. ఇప్పుడు తెలుగులో మరో మూవీ చేసేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. యంగ్ అడల్ట్ మూవీలో నటించనుంది అమ్మడు. 18 ప్లస్ వాళ్లు చూసే కంటెంట్ తో రూపొందే ఆ సినిమా షూటింగ్ అక్టోబర్ లో ప్రారంభం కానుంది. కళాశాల వాతావరణంలో కొత్త క్యాస్టింగ్ తో ఫ్రెష్ గా తీయబోతున్నారని సమాచారం. అమెజాన్ ప్రైమ్ వీడియో ఒరిజినల్ గా రూపొందనున్న ఆ మూవీకి నిర్మాతల్లో ఒకరిగా కూడా ఆలియా భట్ వ్యవహరించనుంది. ఎటర్నల్ సన్ షైన్ పిక్చర్స్ బ్యానర్ పై నిర్మించనుండగా, చాక్ బోర్డు ఎంటర్టైన్మెంట్ బ్యానర్ సహా నిర్మాణ సంస్థగా వ్యవహరించనుంది. శ్రీతి ముఖర్జీ దర్శకురాలిగా పరిచయం అవ్వనున్నారు. వార్-2 డైరెక్టర్ అయాన్ ముఖర్జీ బంధువు అయిన ఆమె.. ఇప్పుడు ఆలియా భట్ తో డెబ్యూ మూవీ చేస్తుండడం విశేషం.

అయితే అలియా- శ్రీతి కాంబినేషన్ లో రానున్న సినిమా కథ వెనుక ఇంట్రెస్టింగ్ కథ ఉందని తెలిసింది. నిజానికి అలియా భర్త, స్టార్ హీరో రణబీర్ కపూర్ నటించిన వేక్ అప్ సిడ్ మూవీ అంటే ఆమెకు చాలా ఇష్టమట. ఆ మూవీ కథను అమ్మాయిల కోణంలో, కాస్త బోల్డ్ గా చెబితే బాగుంటుందని శ్రీతి ముఖర్జీకి చెప్పిందట అలియా. దీంతో ఇంకేముంది.. శ్రీతికి కాన్సెప్ట్ నచ్చి స్టోరీని డెవలప్ చేసినట్లు సమాచారం. ఇప్పుడు అలియా.. ఆ కథతో తీయనున్న సినిమాలో యాక్ట్ చేస్తున్నారు. తెలుగు సహా అన్ని భాషల్లో స్ట్రీమింగ్ అవ్వనుంది ఆ చిత్రం. అదే సమయంలో మరిన్ని మూవీల్లో నటిస్తూ అలియా బిజీగా ఉంది. చాముండా మూవీలో యాక్ట్ చేస్తున్నారు. కల్కి 2లో కూడా నటించనున్నారని టాక్ వస్తోంది. మరి అప్ కమింగ్ మూవీస్ తో ఎలాంటి హిట్స్ అందుకుంటారో వేచి చూడాలి.